POSTAL REGD.NO.PRAKASAM/16/2021-2023
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
అక్టోబర్ 2021
వెల – ₹ 10.00

సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సంపుటి: 39 సంచిక: 06

పూజ్యశ్రీ ఆచార్య ఎక్కిరాల భరద్వాజ మహారాజ గారి జన్మదిన మహోత్సవము
అక్టోబర్ 30, 2021

మంగళ హారతి
మంగళమిదె మంగమ్మ తల్లికి!

అరుదెంచిన అరవిందాక్షికి
భరద్వాజ భగవానుని సతికి
మంగళమిదె మంగమ్మ తల్లికి
మంగళమిదె మా కల్పవల్లికి

1. కరుణా పూరిత కన్నుల చిందెడు
కనకపు కాంతుల వెలుగులతో
మందస్మిత వదనారవిందమున
విలసిల్లెడు సోయగములతో ॥అరుదెం॥

2. లలిత చలిత సుమనోహర రూపమై
వ్యథిత హృదయ రంజిత సుస్వరమై
ముదిత ప్రఫుల్లిత నందన సుమమై
కల్లోలిత జగతికి ఒక వరమై ॥అరుదెం॥

తాత్పర్యము:

కమలముల వంటి కన్నులు కలిగి భక్తుల పాలిటి కల్పవృక్షమై వచ్చిన శ్రీ భరద్వాజ గురుదేవుల సతీమణి అయిన మాత అలివేలు మంగమ్మ తల్లికి మంగళమగును గాక!

1. కారుణ్యపు బంగరు కాంతులు చిందే కన్నులతో, చక్కని చిరునవ్వులు చిందించే ముఖారవిందముతో విచ్చేసిన మాత అలివేలు మంగమ్మ తల్లికి మంగళమగును గాక!
2. బాధాతప్త హృదయాలను ఓదార్చి ఆనందింపజేసే మధుర గానము లాగా, వ్యధలతో తపిస్తూ వుండే మానవాళితో నిండిన యీ జగత్తును ఆహ్లాద పరుస్తున్న నందనవనములోని నిండార విరబూసిన పుష్పము లాగా - సుతారముగా కదిలే లావణ్యముతో వచ్చిన మాత అలివేలు మంగమ్మ తల్లికి మంగళమగును గాక!
లోకాలకు వరప్రదాయినిగా వచ్చిన మంగమ్మ తల్లికి మంగళమగును గాక!

- శ్రీమతి శ్రీదేవి

సాయి శిరిడీనే ఎందుకు ఎన్నుకున్నారు?

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

గత శతాబ్దంలోని మధ్య ప్రాంతంలో శ్రీ సాయినాథుడుగా ప్రసిద్ధి చెందిన సాయిబాబా మొదటిసారిగా శిరిడీ గ్రామ పరిసర ప్రాంతాలలో ప్రకటమయ్యారు. ఆ ప్రక్క గ్రామాలకు తరచుగా విచ్చేస్తున్న బాబా శిరిడీ తమ స్థిర నివాసంగా ఎన్నుకున్నారు. ఆ గ్రామము, మరి మూడు యితర గ్రామాలూ తమకు వారి 'యజమాని' ('మాలిక్' అంటే భగవంతుడు లేక గురువు) ప్రసాదించారని ఆయన తరచుగా చెప్పేవారు. ఆ గ్రామం (శిరిడీ) అనాదిగా తన ప్రజల నివాసమని, అది తన అత్తగారిల్లు అని (సాసర్ వాడా) ఆయనే అంటుండేవారు. అక్కడ వెనుకటి కాలంలో తమవారంతా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:39 అక్టోబర్-2021 సంచిక:06

ఆరంభంలో పూజ్యశ్రీ అమ్మగారి జన్మదిన మహోత్సవము (1-10-2021), మధ్యలో పూజ్యశ్రీ సాయినాథుని ఆరాధనా మహోత్సవమైన విజయదశమి (15-10-2021), చివరిలో పూజ్యశ్రీ మాస్టరుగారి జన్మదిన మహోత్సవము (30-10-2021) ఉన్న ఈ అక్టోబర్ నెలలో శ్రీ సాయిమాస్టర్ భక్త జనులకు చక్కని స్మరణ జరిగేలా ఉపయోగపడే ప్రత్యేక సంచిక!!

విషయ సూచిక

01.	సాయి శిరిడీనే ఎందుకు ఎన్నుకున్నారు?	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	03
02.	కృతజ్ఞత ఎందుకు తెలుపుకోవాలి?	పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ	06
03.	మాతృ చరణ సన్నిధి	శ్రీమతి అడిదం వేదవతి	10
04.	నిత్య సనాతనా! ధర్మస్వరూపా!! సాయినాథ దేవా!!!	పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ	18
05.	ధర్మమూర్తి	శ్రీమతి శ్రీదేవి	21
06.	ఆచార్యుని అద్భుత లీలలు	వెంకట కృష్ణ మోహన్ ; శ్రీ రాజాలాల్	26

చిరునామా
Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550
www.saibharadwaja.org

చీఫ్ ఎడిటర్: డా॥ ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

చందా వివరములు

విడి ప్రతి	:	రూ. 10-00
సంవత్సర చందా	:	రూ. 100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.

ఆ ప్రదేశంలోనే నివసించేవారని ఆయన కొన్ని సందర్భాలలో భక్తులతో చెబుతుండేవారు. ఆయనకి ప్రీతిపాత్రమైన ఆ గ్రామానికి ఎప్పుడు ఎక్కడ నుంచి వచ్చారో నిశ్చయంగా చెప్పలేము. ఆ విషయమై వేర్వేరు సందర్భాలలో ఆయనెన్నో కథలు చెప్పారు.

ఒక్కొక్కప్పుడు తామొక్కరుగానే అక్కడకు వచ్చామని చెప్పేవారు. వేరు సమయాలలో మరికొందరితోనో కలిసి తమ భక్తులను తరింప చేయడానికి వచ్చామని చెప్పారు. మరికొన్నిసార్లు తమ గురుదేవులను సేవించడానికి వచ్చామనేవారు. ఇలా ఆయన తరచుగా చెప్పేవాటిలో ఒక వృత్తాంతమున్నది. ఆయన రెండు శతాబ్దాల తర్వాత తిరిగి మరలా అచటికి వచ్చి స్థిరనివాసం చేస్తున్నామనీ, అంతకుపూర్వం గూడ ఎన్నోసార్లు అక్కడ నివసించామని గూడ చెప్పేవారు. వారి జన్మస్థలము వేరొక చోట వున్నదని, అక్కడ వారి వంశస్థులకు ఆసిపాస్తులు గూడ వుండేవని, అక్కడే తమ బాల్యం గడిపామని, పిత్రార్జితమైన తమ ఆస్తి వేరొకచోట వున్నదని చెబుతుండేవారు. అప్పటి భక్తులు వారి పూర్వీకుల గూర్చి, స్వస్థానం గురించి గాని ఏమి విచారించి కనుక్కోలేదు. తమ స్వస్థానంలో వేర్వేరు కళలు, వృత్తులలో ఆరితేరిన వారెందరో వున్నారని, వారందరూ దయాహృదయులు, మరియు భక్తులు అని బాబా చెప్పేవారు. వారి సిరిసంపదలు అద్వితీయమైనవనీ, అన్ని రంగాలలోనూ వారు సాటిలేని వారనీ బాబా చెప్పేవారు. స్థానిక ప్రజలపై వారికి గల మక్కువ, మరియు నీంగావ్, రూయీ, రహటా, పింపల్ గావ్, కోపర్గావ్ మొదలైన పరిసరాల గ్రామాలను గూర్చి, వాటి ప్రాముఖ్యత గూర్చి తరచుగా ప్రస్తావిస్తూండేవారు. వీటిని బట్టి ఆ ప్రాంతమంతా ఎంతోమంది మహనీయుల నివాసం వలన పరమ పవిత్రమైనదని తెలుస్తున్నది.

ఒకప్పుడు తమ పూర్వీకులు శిరిడీలో నివసించారని అందుకే తామచటికి మరలా వచ్చి నివసిస్తున్నామనిగూడ ఆయన అనేవారు. ఉజ్వలమైన సిరిసంపదలతో విలసిల్లిన ఒక నగరము ఆ ప్రాంతంలో వుండేదని వారి మాటలవలన తెలుస్తుంది. తర్వాత కాలంలో కేవలమొక కుగ్రామంగా మిగిలిన శిరిడీ ప్రాంతం వారి నివాసముతో మరలా తిరిగి అంతటి మహోన్నతమైన నగరంగా రూపొందగలదని తోస్తుంది. ఇటీవల కాలం వరకూ ఎవరూ పట్టించుకోని, ఏమి పండని గ్రామ ప్రాంతంగా ఉన్నది ఒకనాడు నమ్మశక్యం కానంతటి ఒక గొప్పకోటగా ఉండేదని, దానికి చుట్టూరా మనోహరమైన తోపులూ, ఫలవృక్షాలూ వుండేవనీ, వారి ప్రసంగాల వలన తెలుస్తుంది. ఆ పట్టణ వీధులెంతో విశాలంగా వుండేవట. వాటి కిరువైపులా ఎంతో సంపన్నులు, మహాభక్తులు అయిన మార్వాడి వ్యాపారులు నివసించేవారట.

అంటే ఒకనాడు తమ పెద్దలకు నివాసమైనందు వల్లనే సాయి అంత తరచుగా విచ్చేస్తున్న శిరిడీనే మరలా తమ సంస్థానంగా చేసుకున్నారట. ఆయనను దర్శించవచ్చే యాత్రికుల సంఖ్య నానాటికీ పెరుగుతున్నది. తత్ఫలితంగా ఆ గ్రామంలో వసతులు గూడా నానాటికీ పెరుగుతున్నాయి. ఈ మధ్యకాలంలో ఆ ప్రాంతంలో త్రవ్వించబడిన కందకాల వలన ఆ ప్రాంతం సస్యశ్యామలమయింది. వెనుక శీలధి అను పేరు గల ఈ గ్రామం భక్తులకు మరో పండరీపురం అవుతోంది. సాయినాథుడు మరలా మరొక రమావరుడయ్యాడు. అందుకే "శిరిడీ మాఝే పండరపురా, సాయిబాబా రమావరా" అని కీర్తించాడు, భక్తుడు గణపతి రావు సహస్రబుద్ధే ఉరఫ్ దాసగణు. ●

కృతజ్ఞత ఎందుకు తెలుపుకోవాలి?

పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ

'కృతజ్ఞత' ఎందుకు తెలుపుకోవాలి? అన్న విషయం గూర్చి, ప్రకృతి పట్ల, ఇతర జీవుల పట్ల, ఇతర మానవుల పట్ల 'కృతజ్ఞత' ఎందుకు కలిగివుండాలన్న విషయం గూర్చి ఇంతకుముందు క్లుప్తంగా చెప్పుకున్నాము. ఇప్పుడు మరికొంచెం చెప్పుకుందాము.

'కృతజ్ఞత' అనేది మానవ జీవితంలో అతిముఖ్యమైన

అంశమన్నది నిజమే. కానీ భగవంతుడు మనకందించిన విశాల ప్రకృతి, ఇతర జీవులు, వాటన్నింటి రూపంలోనూ మనపై ఆయన కురిపించే కరుణ మనకు అవగతం కావాలంటే వాటన్నింటినీ గుర్తించే మేధాశక్తి, చక్కటి నిర్మాణమూ గల శరీరమొకటి వుండాలి. అట్టిది ప్రసాదించింది కూడా వారేగదా! అట్టి శరీరమే లేకపోతే మనమేమి చేయలేము.

పూజ్యశ్రీ మాస్టరుగారిలా అంటారు: "అసలు మన శరీరాన్ని గురించి ఆలోచిస్తే చాలు. అట్టి అద్భుతమైన శరీరాన్ని సృష్టించిన భగవంతుని పట్ల భక్తి కలుగక మానదు. దానిని ప్రసాదించిన ఆయనకు కృతజ్ఞత చెప్పకుండా వుండలేము".

ఆలోచిస్తే నిజంగా ఈ శరీరనిర్మాణమెంత చిత్రమైనది!! మెదడు, వెన్నుపూస, గుండె, శ్వాసకోశము, మూత్రపిండములు, జీర్ణకోశము, చిన్న, పెద్ద ప్రేగులు, మల మూత్రాశయములు, చేతులు, కాళ్ళు, నోరు, ముక్కు చెవులు, ఎముకలు, కండరములు, నరములు – ఇవన్నీ ఎంత పొందికగా ఈ శరీరంలో అమర్చబడివున్నాయి!!

మనం ఆహారం తీసుకోవాలంటే దానిని నోటికి అందించడానికి చేతులు; తీసుకున్నదానిని నమిలి లోపలకు పంపడానికి నోరు, నమలడానికి అవసరమైన దంతాలు, నాలుక, లోపలకు వెళ్ళిన తర్వాత పచనం చేయడానికి జీర్ణకోశము, దానిని అరిగించి శరీరభాగాలకు పంపే చిన్న ప్రేగులు, వ్యర్థ పదార్థాలను బయటకు పంపే పెద్ద ప్రేగులు, మలమూత్రనాళములు – ఇవన్నీ ఒక విభాగమైతే... –

గాలి పీల్చడానికి ముక్కు, దాని ద్వారా వెళ్ళే వాయువును స్వీకరించి, ప్రాణ చలనానికి అవసరమైన వాయువును



స్వీకరించి, అనవసరమైన వాయువును బయటకు పంపించే శ్వాసకోశములు –మరొక విభాగము.

శరీరంలోని రక్తాన్ని శుభ్రపరచే గుండె – దానిని శరీరమంతటికీ పంపిస్తూ అపరిశుభ్ర రక్తాన్ని మళ్ళీ గుండెకు చేర్చే రక్తనాళములు – ఇంకొక విభాగము.

గుండె, శ్వాసకోశములు – మనిషి మరణించేదాకా క్షణం గూడ విరామం లేకుండా శ్రమించడం ఎంత అద్భుతమైన విషయము!

ఇవిగాక, దేనినైనా చూడగలగడానికి కళ్ళు, వినగలగడానికి చెవులు, ఏపనినైనా చేయగలగడానికి కాళ్లు చేతులు – మరొక విభాగము.

ఇవన్నీ సక్రమంగా కదలడానికి అవసరమైన ఎముకలు, కండరములు, కీళ్ళు, కణసముదాయము – మరొక విభాగము.

ఇదిగాక అద్భుతమైన పునరుత్పత్తి వ్యవస్థ –

వీటిలో ఏ ఒక్కదానిలో చిన్న సమస్య వచ్చినా శరీర పరిస్థితి అస్తవ్యస్తమే!

అంతేగాక, శరీరంలో దేనినైనా మనము బయటకు తీయగలిగితే తిరిగి దానిని శరీరంలో అలా కూర్చలేము. ఇది యింకా అద్భుతమైన విషయం .

ఉదాహరణకు అప్పుడే పుట్టిన బిడ్డను వెంటనే తల్లి గర్భంలో అలా పొందికగా వుంచాలంటే సాధ్యం కాదనిపిస్తుంది. అలాగే చిన్న ప్రేవులను బయటకు తీస్తే మళ్ళీ అలాగే పెట్టడం మన వల్లగాదు. అలాగే ఒకడు చాలా ఎక్కువ ఆహారం తీసుకునేవాడు వున్నాడనుకుందాము. వాడు రెండు కిలోల అన్నం తిన్నప్పటికీ అతని పొట్ట పెద్దది కాదు. మామూలుగానే వుంటుంది. మరి అంత అన్నం శరీరంలో ఎలా యిమిడింది? విచిత్రమేమంటే ఇవేవీ ఒకదానికొకటి అడ్డురాకుండా సర్దుకుపోతూ ఒదిగి ఒదిగి తమ పనులు సక్రమంగా చేసుకుపోతుంటాయి. కానీ ఈ శరీరం గల మానవునికి మాత్రమే ప్రకృతితోగానీ మనవంటి శరీరాలేగల సాటి మానవులతో గానీ సర్దుకుపోవడం ఎంత కష్టమో!

ఇవన్నీ ఒక ఎత్తైతే వీటన్నింటికీ సరియైన సమయంలో సంకేతాలు అందిస్తూ సక్రమంగా పనిచేయించే అతి ముఖ్యమైన పరికరం మెదడు. ఈ మెదడు సరిగ్గా పనిచేయకపోతే ఏమీలేనట్టే! దానిలో ఏమాత్రం తేడా వచ్చినా కొన్ని విషయాలు గ్రహించలేకపోవడము, చేయలేక పోవడము, పిచ్చివారుగా మారడము - ఇలాంటివన్నీ జరుగుతాయి. మెదడు పూర్తిగా దెబ్బతింటే మిగతా అవయవాలు పనిచేసే స్థితిలో వున్నా మనిషి ప్రాణమున్న శవమే. అయితే బాహ్యక్రియలకు అది ప్రాణమున్న శవమే అయినప్పటికీ ప్రాణం వున్నంతవరకూ 'నేను' అనే ప్రజ్ఞ వుంటుంది. ఆ ప్రాణంపోతే ఎటువంటి స్పందనలూ ఆ శరీరానికి వుండవు. ఇంతకూ ఈ 'నేను' అనే ప్రజ్ఞ ఏమిటి? అది ఎలా పనిచేస్తుంది? ప్రాణంపోయాక ఎక్కడికి పోతుంది? అసలు ప్రాణమంటే అదేనా? దీనినంతటినీ నడిపించే శక్తి ఏదైనా వున్నదా? వీటన్నింటినీ ఆలోచించే శక్తి, ఓర్పు మనకు వుండవు.

అయితే యిటువంటి ప్రశ్నలే ఉద్భవించినవారు కొందరు వాటిని గురించి తీవ్రంగా ఆలోచించారు. సమాధానం దొరికేదాకా ఆలోచించి దీనినంతటినీ నడిపించే శక్తి ఒకటి వున్నదని, అదే సృష్టికంతటికీ మూలమైన శక్తి అని, దానినే భగవంతుడంటారనీ తెలుసుకున్నారు. అలా ఆలోచనలతో మధించి ఈ సత్యాన్ని దర్శించినవారు పూజ్యశ్రీ మాస్టరుగారు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. ఇవన్నీ ఆలోచించే మనస్సు, వివేచించే బుద్ధి మానవులకు మాత్రమే వున్నది. ఈ మనస్సు ఎంతో చిత్రమైనది. ఏదైనా చేయగల శక్తిగలది కనుక దానిని బుద్ధి ద్వారా, ఆలోచనల ద్వారా ఎలా

ఉపయోగించుకుంటే అలా మనలను నడిపిస్తుంది. దురాలోచనల ద్వారా దుష్కర్మలను చేయించి, మనలను అధఃపాతాళానికి అణగదొక్కగలదు. సత్సంకల్పాల ద్వారా సత్కర్మలు ఆచరింపజేసి ఊర్ధ్వలోకాలకు తీసుకువెళ్ళగలదు. వీటన్నింటినీ మించి సర్వానికి మూలమైన పరమాత్మ తత్వానికి చేర్చగలదు. మనిషిని మనీషిగా, భగవంతునిగా తీర్చిదిద్దగలదు.

మరి ఇంతటి అద్భుతమైన మన శరీరాన్ని సృష్టించిన శక్తి ఎంతటి విశిష్టమైనది? అలాగాక భగవంతుడే అనుకుంటే అతడెంత మహోన్నతమైన, విశిష్టమైనవాడు! అందుకే ఈ రహస్యాన్ని లేక విచిత్రాన్ని గూర్చి తెలుసుకోవాలని తపస్సు చేసిన వారికి కలిగిన అనుభూతి – భక్తి,

ఇలా ఆలోచిస్తే మనకూ ఆ శక్తి పట్ల, భగవంతుని పట్ల ఆశ్చర్యము, ఆనందమూ కలుగక మానవు. అదే భక్తి, అదే ప్రేమ.

"ఆశ్చర్యము, ఆనందమూ మేళవించేదే భక్తి" అని పూజ్యశ్రీ మాస్టరుగారు చెబుతారు.

పూజ్యశ్రీ మాస్టరుగారు యింకా యిలా అంటారు: "మానవజన్మ అతి దుర్లభమైనది. ఈ శరీరం లేనిదే జన్మలేదు. కనుక ఈ శరీరాన్ని చక్కగా వినియోగించుకోవాలి. "మానవ జన్మకు వచ్చిందెందుకు? పిడకలు ఏరుకోవడానికా?" అని బాబా చెప్పినట్లు దీనిని దుర్వినియోగం చేసుకుంటే పిడకలేరుకున్నట్లే అవుతుంది" అని.

దేనినైనా అసలు ఉపయోగించకపోయినా, లేక సరిగా ఉపయోగించకపోయినా పాడవడం తథ్యం. అలాగే మన శరీరాన్ని సరిగా ఉపయోగించకపోతే అది సరిగా పనిచేయదు. అందుకని ఈ శరీరాన్ని సక్రమంగా వినియోగించుకోవాలి. ఆహార, విహారాలలో జాగ్రత్త వహించాలి. పరిశుభ్రమైన గాలి, పరిసరాల పరిశుభ్రత, శరీర పరిశుభ్రత పాటించాలి. సమయానికి తగినంత నిద్రపోవాలి. అన్నింటినీ మించి సత్ప్రవర్తన కలిగివుండాలి.

ఆలోచిస్తే ఇంతటి ప్రాముఖ్యతగల ఈ శరీరాన్ని మనము ఎంతగా దుర్వినియోగం చేసుకుంటున్నామో అర్థమవుతుంది.

అతి దుర్లభమైన మానవజన్మకు ఆధారమైన ఈ శరీరాన్ని ఎలా జాగ్రత్తగా ఉపయోగించుకోవాలో, ఏ జీవికీ లేని వివేచించగల మనస్సుతో ఎలా ఆలోచించి శాంతిని పొందాలో పెద్దలు తపస్సుతో తెలుసుకుని అనేక శాస్త్రాల ద్వారా మనకు తెలియపరచారు.

ఇవన్నీ ఆచరించాలంటే మనస్సును సరియైన విధంగా ఆలోచింపజేయాలి. అందుకు వివేచనగల బుద్ధి చెప్పినట్లు మనస్సు ప్రవర్తించేలా చేయాలి. అట్టి వివేచన కలగాలంటే సత్సాంగత్యము, సద్గురు సేవ చేయాలి. సద్గురు బోధలనాధారంగా చేసుకుని సత్సాంగత్యముతో సద్బుద్ధితో ఆలోచించి, సచ్చింతన చేస్తే మనం కోరుకునే శాంతి, తృప్తి లభిస్తాయి. అప్పుడు పరిస్థితులు ఎలా వున్నా మనస్సు చలించదు.

ఇవన్నీ జరగాలంటే శరీరమనే అతి ముఖ్యమైన పరికరం కావాలి. మరి ఇంతటి అద్భుతమైన శరీరాన్ని మనకు ప్రసాదించిన ఆ భగవంతునికి మొదటగా కృతజ్ఞత చెప్పుకోవాలి. అయితే భగవంతుడు శరీరాన్ని, అనంత శక్తిగల మనస్సునూ యిచ్చినప్పటికీ, సరియైన మార్గాన నడిపించగల సద్గురువు లేనిదే మనము సరియైన మార్గాన పయనించలేము. అలా మనలను చేయిపట్టి నడిపించగల సద్గురువు పూజ్యశ్రీ మాస్టరుగారు. కారణం ఆయన ఎవ్వరూ చెప్పనంత వివరంగా ప్రతి విషయాన్ని ఎలా వివేకంతో ఆలోచించి ఆచరించాలో తెలియజెప్పారు. అందుకని ఆయనకు కృతజ్ఞత చెప్పుకోవడము మన కనీస కర్తవ్యము. అయితే ఆయనకు కృతజ్ఞత చెప్పుకోవడమెలా? మళ్ళీ మొదటికే వచ్చాము.

ఎలాగంటే.. పైన చెప్పుకున్న విధంగా ప్రవర్తిస్తూ పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన వాటిని, ఆచరించి చూపిన వాటినీ స్మరించుకుంటూ వుంటే ఆనందము, ఆశ్చర్యము కలిగి ఆయనయందు భక్తి, ప్రేమ కలుగుతాయి. అప్పుడు ఆయనపట్ల కృతజ్ఞతాభావం కలుగుతుంది. అట్టి భావం మనలో కలిగినపుడు ఆయన మనకు ప్రసాదించినదానికి మనమేమి సమర్పించుకుంటే ఋణం తీరుతుంది? అన్న భావన కలుగకమానదు. కనుక పూజ్యశ్రీ మాస్టరుగారికి కృతజ్ఞతగా 'కృతజ్ఞతా మహోత్సవము' జరుపుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా వున్నది. అది మన కనీస కర్తవ్యము. లేకపోతే ఆయనను ఆశ్రయించిన మనమందరమూ కృతఘ్నులమే అవుతాము. కనుక మనకు సద్బుద్ధినీ, వివేకాన్నీ ప్రసాదించి సన్మార్గాన నడిపించే సద్గురువైన పూజ్యశ్రీ మాస్టరుగారికి కృతజ్ఞతా పూర్వకంగా 'కృతజ్ఞతా మహోత్సవము' జరుపుకుందాము.●

మాతృ చరణ సన్నిధి

శ్రీమతి అడిదం వేదవతి

ఆధునిక యుగంలో మహాత్ములందరూ కలిసి సమర్థ సద్గురువైన శ్రీ సాయినాథుని ఆధ్వర్యంలో చేసినటువంటి వివాహమే పూజ్యశ్రీ అమ్మగారి, పూజ్యశ్రీ మాస్టరుగార్ల కళ్యాణం. ఉద్దండులైన మహాత్ములందరూ కలిసి జరిపించిన ఈ కళ్యాణం లోక కళ్యాణమే!

పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారు తమ సద్గురువైన శ్రీ సాయినాథుడు సూచించిన అర్ధాంగిని పొందిన ధర్మవిగ్రహుడు. పూజ్యశ్రీ అమ్మగారు తమ సేవతోను, సాధనతోను సమర్థ సద్గురు శ్రీ సాయినాథుని మెప్పించి, ఆయన సూచించిన పూజ్యశ్రీ మాస్టరుగారిని ఆత్మజ్ఞానియైన భర్తగా పొందిన ధర్మస్వరూపము. వారి గృహస్థజీవనం శ్రీ సాయినాథుని అవతారకార్యానికి సారథ్యం వహించి ఆ సద్గురు తత్వాన్ని, బోధలను, లీలలను దశదిశలా వ్యాపింపజేస్తున్నది.

పూజ్యశ్రీ మాస్టరుగారి జీవితం గురించి, బోధల గురించి, లీలల గురించి, మనకు కొంతవరకు తెలుసు. పూజ్యశ్రీ అమ్మగారి జయంతి సందర్భంగా ఆమె జీవితాన్ని గురించి స్మరించుకుందాము.

అత్యంత భక్తి ప్రపత్తులు, వైరాగ్యము, దానధర్మాలు, కలిగిన ఉన్నత ఆధ్యాత్మిక కుటుంబంలో జన్మించిన పూజ్యశ్రీ అమ్మగారు తీవ్రమైన భక్తితో జిల్లేళ్ళమూడి అమ్మ సేవకు యుక్తవయస్సులోనే అంకితమయ్యారు. తను, మన, ప్రాణాలను లెక్కచేయక, నిద్రాహారాలు మాని, సంపూర్ణ శరణాగతితోనూ, అత్యంత భక్తిశ్రద్ధలతోనూ, ఎన్నో సంవత్సరాలపాటు నిరంతరసేవలో నిమగ్నమై పోయారు. తండ్రి మరణించినప్పుడు తప్ప అన్ని సంవత్సరాలలోనూ ఒకసారి కూడా ఇంటికి రాలేదు. ఆహారం సరిగా లేకపోవడం వలన, తీవ్రమైన శారీరక శ్రమ చేయడం వలన, భరింపరాని అనారోగ్యంతో చిక్కి శల్యమైన ఆమెను ఇంటికి పంపించారు ఆశ్రమం వారు.

ఆ క్రమంలో సమర్థ సద్గురువైన శ్రీ సాయినాథుని బోధల ప్రభావంవలన ఆ సద్గురుమూర్తికి శరణాగతి చెంది ఆయన సేవలో మునిగిపోయారు. తమ సాధనను తీవ్రతరం చేశారు. పారాయణ, జపము, ధ్యానము, హారతులు, సత్సంగము చేస్తూ గడిపేవారు. ఆమెకు సమర్థ సద్గురు సాయినాథుడు దర్శనమిచ్చి, ఆమె సంపూర్ణ బాధ్యతను స్వీకరించి, అన్నీ తామే నడిపిస్తామని, చూస్తూ వుండమని అభయమిచ్చి ఆత్మజ్ఞాని, తన ప్రియశిష్యుడు అయిన పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారిని భర్తగా అనుగ్రహించారు. వివాహానంతరం పూజ్యశ్రీ మాస్టరుగారిని, బాబాను నిరంతరం స్మరించడం, సేవించడం, అనుసరించడమే తమ జీవిత కార్యక్రమంగా నిర్ణయించుకొని దీక్షతో తమ చివరి క్షణం వరకు నిర్వర్తిస్తూనే వున్నారామె.

పూజ్యశ్రీ మాస్టరుగారు సశరీరులుగా వున్నంతకాలం సమర్థ సద్గురువైన ఆయనకు పతివ్రతగా సర్వసమర్పణ చేసుకుని ఆయన అర్ధాంగిగా ఆయన అవసరాలను ఎంతో శ్రద్ధగా నిర్వర్తించేవారు. ఆయన సూచించిన తీవ్రమైన సాధనలను పట్టుదలతో పూర్తి చేసి ఆయనను మెప్పించారు. అప్పుడు తమ కర్మను ఈ జన్మలోనే అనుభవించి మరుజన్మ లేకుండా చేసుకోదలచానని పూజ్యశ్రీ మాస్టరుగారిని కోరారు.



ఆయన అనుజ్ఞతో ఆ నిర్ణయానికి కట్టుబడిపోయారామె! తత్ఫలితంగా తీవ్రమైన అనారోగ్యం ఆమె శరీరాన్ని ఆవరించింది. సశరీరంగా వున్నంతకాలం భయంకరమైన కీళ్ళవ్యాధి ఆమెను పీడిస్తూనే వున్నది. చివరకు నడవలేని స్థితిలో ఆమె దశాబ్దాలపాటు మంచానికే పరిమితమవ్వవలసి వచ్చింది. భరించలేని శారీరక బాధలు పీడిస్తున్నప్పటికీ ఒక్కసారి కూడా వాటిని తొలగించమని పూజ్యశ్రీ మాస్టరుగారిని గాని, బాబాను గానీ ఆమె ప్రార్థించలేదు. అటువంటి పరిస్థితులలోనే, మేము చిన్నపిల్లలుగా వున్నప్పుడే పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి చెందారు. అయినా ఆమె చలించలేదు. వారిని ఏమీ అడగనవసరం లేదని, వారు తమకు ఏది శ్రేయస్కరమో అదే జరగనిస్తారనీ ఆమెకు స్పష్టంగా తెలుసు. అదే అచంచల విశ్వాసము, నిష్ఠ, సబూరీ!

అంతటి అనారోగ్యం ఆమెను బాధిస్తున్నప్పటికీ పూజ్యశ్రీ మాస్టరుగారికి అన్ని సేవలూ తామే స్వయంగా చేసేవారు. ఆయనకు కాఫీ కలపడం, భోజనం వడ్డించడం, ఆయన వస్త్రాలను, వస్తువులను సంరక్షించడం – అన్నీ స్వయంగా చేసేవారు. సాయిసేవలో ఆయనకు ఎటువంటి అసౌకర్యము కలుగకుండా గృహనిర్వహణ, అతిథి అభ్యాగతుల ఆదరణ, ఇంటికి వచ్చే భక్తుల అవసరాలు స్వయంగా చూసుకునేవారు. అంతేకాదు, పూజ్యశ్రీ మాస్టరుగారి అవతారకార్యంలో ఆమే ఆయన ఏకైక భాగస్వామి. ఆయన చేసే రచనలన్నీ శుద్ధ ప్రతి (Fair copy) వ్రాయడం, ప్రూఫులు దిద్దడం, ఎడిటింగ్ స్వయంగా చేయడం చేసేవారు. అందుకే ఇద్దరి రచనలలోనూ ఒకే శైలి కనిపిస్తుంది.

పూజ్యశ్రీ అమ్మగారు మా తల్లిగా మా ప్రతి విషయాన్నీ శ్రద్ధగా పట్టించుకునేవారు. మా పట్ల వారి ప్రేమ వర్ణింపనలవిగానిది. అంతేకాదు, మా వ్యక్తిత్వాలను పూజ్యశ్రీ మాస్టరుగారి మార్గంలో నడిచేలా మలచడంలో ఆమెకు ఆమే సాటి. ప్రతి విషయంలోనూ ఏది మంచో, ఏది చెడో, ఏది ఎలా ఆలోచించుకోవాలో చెప్తూ మాలో వివేకాన్ని, విచక్షణను, అవగాహననూ పెంచి పరిస్థితులను ధర్మబద్ధంగా మలచుకునేందుకు ప్రోత్సహిస్తారు. జీవితంలో ప్రతి అంశానికీ పవిత్రతను, కృతజ్ఞతను, కర్మసిద్ధాంతాన్ని జోడించి

చెప్పి దానిపట్ల ఒక ఉన్నతమైన భావాన్ని, అవగాహనను, ఆచరణయోగ్యమైన విధానాన్నీ సూచిస్తారు. మనం ఏఏ విషయాలను తేలికగా తీసుకోవాలో, ఏఏ విషయాలలో దృఢంగా వుండాలో నేర్పుతూ ధర్మబద్ధమైన దృక్పథాన్ని నేర్పి మనలను మరింత ధీరులుగా తయారు చేస్తారు. పూజ్యశ్రీ అమ్మగారితో మేము ఎటువంటి దాపరికం లేకుండా ఏ విషయమైనా స్వేచ్ఛగా చెప్పవచ్చు, ధైర్యంగా చర్చించవచ్చు. ఏ ఒక్క విషయాన్నీ దాచవలసిన అవసరం నాకెప్పుడూ రాలేదు. ఎవరు మమ్మల్ని అర్థం చేసుకోకున్నా, అమ్మ మాత్రం మమ్మల్ని తప్పకుండా అర్థం చేసుకుంటారని మాత్రం మా ఇద్దరికీ స్పష్టంగా తెలుసు. అందుకే ఆమే మా బలం. మనం చేయదలచుకున్న మంచి పనులలో చేయవలసిన విధానాన్ని తెల్పి, వివేకాన్ని పెంచి, ఉత్సాహాన్ని నింపి ప్రోత్సహించడంలో ఆమెకి ఆమే సాటి!

జ్ఞానమూర్తి అయిన పూజ్యశ్రీ మాస్టరుగారి సన్నిధికి ఆర్తులు, అర్థార్థులు, జిజ్ఞాసువులు, ముముక్షువులు అయిన భక్తులు నిరంతరం వస్తూనే వుండేవారు. పూజ్యశ్రీ అమ్మగారు ఆదర్శ గృహిణియై వారందరి బాగోగులు చూసుకుంటూ అందరినీ ఎంతగానో ఆదరించేవారు. పూజ్యశ్రీ అమ్మగారి ప్రేమను, ఆదరణను ఒకసారి రుచి చూసినవారు ఎప్పటికీ మరచిపోలేరు. వారు అందరికీ ఎంతో ఆప్తురాలై వారి కష్టసుఖాలను తమవిగా పంచుకునేవారు. వారి కష్టాలను విని చలించిపోయి, తాము కూడా వారి తరఫున బాబాను ప్రార్థించేవారు. ఆహారంలో ఇష్టమైన పదార్థాలను వదిలి మరీ వారి కోసం పారాయణ చేసేవారు. కనుక ఆహారంలో ఆమెకు ఇష్టమైనవేవీ మిగలలేదు! అంతేకాదు. ప్రతివారినీ పూజ్యశ్రీ మాస్టరుగారి సన్నిధిలో సాధ్యమైనంత సమయం గడపమని ప్రోత్సహించి వారి ఆధ్యాత్మిక ఉన్నతికై తపించేవారు. ఆమె ప్రేమవలన, ఆదరణవలననే పూజ్యశ్రీ మాస్టరుగారి వివాహానంతరం ఎంతో మంది ఆయన సన్నిధిని అనుభవించగలిగారు. అవకాశమున్నప్పుడల్లా ఏమీ సంకోచించకుండా ఎవరైనా మన ఇంటికి రావచ్చు, ఎన్నాళ్ళైనా ఉండవచ్చు. పూజ్యశ్రీ మాస్టరుగారి సన్నిధిని అనుభవించవచ్చు. అదంతా పూజ్యశ్రీ అమ్మగారి ఆదరణవలనే సాధ్యపడింది.

పూజ్యశ్రీ మాస్టరుగారిని ఎందరో తమ గురువుగా భావించేవారు. వారిపట్ల అత్యంత భక్తిశ్రద్ధలతో మెలిగేవారు. వారికి పూజ్యశ్రీ అమ్మగారు గురుపత్ని కదా! నిజానికి మరొకరైతే ఆ స్థానంలో అహంకరించివుండేవారే! అధికారం చెలాయించేవారే! కానీ ఆమెలో అటువంటి గుణాలు మచ్చుకైనా కనిపించవు. ఆమె ఎవరినీ శాసించేవారు కాదు. ఏ విషయంలోనూ ఎవరినీ నిర్బంధించేవారు కాదు. ఆమె తమను తాము ఎన్నడూ గురుపత్నిగా భావించలేదు. పూజ్యశ్రీ మాస్టరుగారి సేవకురాలిగానే ప్రవర్తించేవారు. మనసాటి గురుబంధువులాగా, సేవకురాలిలాగా వుండేవారు. పూజ్యశ్రీ మాస్టరుగారి సన్నిధిని అందరూ సాధ్యమైనంత ఎక్కువగా ఉపయోగించుకోవాలని, ఆయనను సేవించుకోవాలనీ తపించారు. ఆమె నడవగలిగినంతకాలమూ తానే స్వయంగా అందరికీవంట చేస్తూ,వారి అవసరాలు తీరుస్తూ వారిని పూజ్యశ్రీ మాస్టరుగారి సన్నిధిలోనే ఎక్కువగా గడపమనీ, ఏ పనులూ చేయవద్దనీ చెప్పి స్వయంగా అన్నీ చేసుకునేవారు. అంత ఆప్యాయంగాను, ఆదరణతోనూ ప్రవర్తించడం వల్ల అందరూ ఆమెతో తమ కష్టాలను, సమస్యలను పంచుకునేవారు. పూజ్యశ్రీ మాస్టరుగారితో చెప్పుకోలేని సమస్యలను కూడా

పూజ్యశ్రీ అమ్మగారి ప్రేమను, ఆదరణను ఒకసారి రుచి చూసినవారు ఎప్పటికీ మరచిపోలేరు. వారు అందరికీ ఎంతో ఆప్తురాలై వారి కష్టసుఖాలను తమవిగా పంచుకునేవారు. వారి కష్టాలను విని చలించిపోయి, తాము కూడా వారి తరఫున బాబాను ప్రార్థించేవారు. ఆహారంలో ఇష్టమైన పదార్థాలను వదిలి మరీ వారి కోసం పారాయణ చేసేవారు. కనుక ఆహారంలో ఆమెకు ఇష్టమైనవేవీ మిగలలేదు!

పూజ్యశ్రీ అమ్మగారితో చెప్పుకోగలిగేవారు.

అటువంటి సందర్భాలలోనే పూజ్యశ్రీ అమ్మగారి ప్రత్యేకత బయటపడేది. ఆమెలోని మానవత్వం దైవత్వంతో మేళవించబడి వుండేది. ఒకవైపు తల్లిలా మన కష్టసుఖాలను మన మనస్తత్వాన్ని, మన అవసరాలను, పరిస్థితులను మన ఆప్తులకంటే ఎక్కువగా అర్థం చేసుకుంటారు, స్పందిస్తారు. ఓదార్చి వివేకాన్ని బోధించి ఉద్ధరిస్తారు. అలా వివేకంతో ధర్మంగా ప్రవర్తించినప్పుడు ఎంతటి ఆత్మశాంతి కలుగుతుందో తాము ఆచరణలో చూపిస్తారు. అందులోనే అంతర్లీనంగా బాబాపై విశ్వాసాన్నీ, శరణాగతినీ, భక్తి శ్రద్ధలనూ మేళవించి బోధించి వాటిని మనసులలో నింపుకునేలా ప్రోత్సహిస్తారు.

ఇంతమంది భక్తుల రకరకాల మనస్తత్వాలతో వ్యవహరిస్తూ, ఎన్నో పరిస్థితులను ఎదుర్కొంటూ వున్నప్పటికీ అంతరంగంలో నిశ్చలులై బాబాపై భారం వేసి ఆయన చేస్తున్న లీలావిలాసాన్ని ఆనందంగా అనుభవిస్తూ వుంటారామె! ఆమె ఎంతగా అందరి గురించీ తాపత్రయపడతారో అంతగానూ వేటికీ అంటని ఒకానొక దివ్యప్రేమ ఆమె నుంచి వర్షిస్తూ వుండేది. ఎదుటివారికి ఎంతో సహాయపడుతూ కూడా వారి నుంచీ ఏమీ ఆశించని నిష్కారణమైన, నిస్వార్థమైన ప్రేమ ఆమె వంటి నిజమైన మహాత్ముల వద్ద మాత్రమే లభిస్తుంది. దానికి మన గుణగణాలతోను, వ్యక్తిత్వాలతోను, స్థితిగతులతోనూ సంబంధముండదు. అట్టి దివ్యప్రేమకు సాటి మరేదీ లేదు!

ఇలా ఆమె పూజ్యశ్రీ మాస్టరుగారికి అర్ధాంగిగాను, మాకు మాతృమూర్తి గాను, గురుపత్నిగాను, గురుస్వరూపిణి అయిన దివ్యజననిగాను అనేక పాత్రలు పోషించారు. వీటన్నింటినీ ఆ సమర్థసద్గురువు తనకు ప్రసాదించిన బాధ్యతగానూ, ఆయన సేవగానూ భావించి అకుంఠిత దీక్షతో చివరివరకూ నిర్వర్తించారు.

సద్గురువు తమను నిరంతరం సేవించిన సచ్ఛిష్యుని తమంతటివారిగా చేస్తారని ఎన్నో మతాలలోని ఎందరో మహనీయుల జీవితచరిత్రలు నిరూపిస్తున్నాయి. సమర్థసద్గురువైన సాయినాథుడు తమ శిష్యులైన పూజ్యశ్రీ మాస్టరుగారిని తమ ప్రతిరూపంగా నిలిపితే పూజ్యశ్రీ మాస్టరుగారు తమ ప్రతిరూపంగా తమ శిష్యురాలైన అమ్మగారిని నిలిపారు. బాబా, మాస్టరుగారి వద్ద జరిగిన లీలలన్నీ నేడు పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధిలో జరుగుతున్నాయి.

పూజ్యశ్రీ అమ్మగారి ఆశీస్సులతో ఎన్నో కష్టాలు తొలిగాయి, ఎన్నో కోర్కెలు తీరాయి. ఎన్నో వ్యాధులు నివారించబడ్డాయి. ఎంతోమంది ప్రాణాలు నిలబడ్డాయి. ఎంతోమందికి ఆమె అభయం వలన లౌకిక, ఆధ్యాత్మిక సమస్యలు పరిష్కరింపబడ్డాయి. ఎంతమంది ఆమె సాంగత్యం వలన, ఆమె సన్నిధి ప్రభావం చేత ఉద్ధరింపబడ్డారో! రోజులు గడుస్తున్నకొద్దీ ఆమె లీలలు, ఆమె ప్రసాదించిన అనుభవాలు వెలుగులోకి వస్తూనే వున్నాయి.

నేడు ఆమె వద్ద జరుగుతున్న లీలలు ఆమె సర్వసమర్థతకు నిదర్శనాలైతే ఆమె జీవితము, బోధలూ నిరంతరం మనకు మార్గదర్శకాలై మనలను అడుగడుగునా సాయి మార్గంలో నడిపిస్తాయి. ఆమె పవిత్ర సన్నిధిలో సహజాతి సహజంగా జరిగిపోయే లీలలు, ఆమె వాచా, ఆచరణరూపంలోనూ అందించే నిరంతర బోధ మనం ప్రత్యేకించి గుర్తిస్తే తప్ప గుర్తించలేనంత నిరాడంబరంగాను, అలవోకగానూ జరిగిపోతుంటాయి. వాటి ప్రభావంలో అపరిమితమైన ఆహ్లాదంగాను, ఆనందంతోను, తృప్తిశాంతులతోనూ గడిచిపోయే మన దైనందిన జీవితాలు గడచిపోతున్న కాలాన్ని సైతం మరచిపోయేలా చేసి తన్మయుల్ని చేస్తాయి. ఆ తన్మయత్వంలోంచి కాస్త మేల్కొని పూజ్యశ్రీ అమ్మగారిని గమనింపజూసినపుడు ఆమె ప్రతీ

> ఆమె తమను తాము ఎన్నడూ గురుపత్నిగా భావించలేదు. పూజ్యశ్రీ మాస్టరుగారి సేవకురాలిగానే ప్రవర్తించేవారు. మనసాటి గురుబంధువులాగా, సేవకురాలిలాగా వుండేవారు. పూజ్యశ్రీ మాస్టరుగారి సన్నిధిని అందరూ సాధ్యమైనంత ఎక్కువగా ఉపయోగించుకోవాలని, ఆయనను సేవించుకోవాలనీ తపించారు.

చర్య, మాట ఎంత ఔన్నత్యంతో కూడుకున్నవో అర్థమవడం మొదలౌతుంది. ఆమెతో గడిపిన ప్రతి క్షణమూ మనకు అవసరమైన బోధను అందించి ముందుకు నడిపిస్తుంది.

ఇతరులతో ఇతర విషయాలు మాట్లాడవలసివచ్చినప్పుడు తప్ప ఆమె పెదవులు నిరంతరం స్మరణతో కదులుతూనే వుండేవి. నిద్రలో కూడా! అలా స్మరణ చేస్తూ చేస్తూ ఆమె చేతులెత్తి బాబాకు, పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కరిస్తూ వుండేవారు. "అమ్మా! స్మరణ చేసుకుంటున్నారా?" అని అడిగితే, "అవునమ్మా! స్మరణ చేసుకుంటున్నాను. స్మరణే సన్నిధి! ఆయన పవిత్ర సన్నిధిలో వున్నామని గుర్తించుకోవడమే స్మరణ!" అనేవారు. ఆమె సన్నిధిలో నిత్యం పూజ్యశ్రీ మాస్టరుగారికి ఉదయం, సాయంత్రం కాఫీ నివేదన, మూడు పూటలా బాబాకు, పూజ్యశ్రీ మాస్టరుగారికి నైవేద్యము, రాత్రికి మంగళహారతి జరుగుతాయి. అలాగే బాబాకు నాలుగు హారతులూ జరుగుతాయి. తరచుగా సత్సంగాలు, భజన జరుగుతుంటాయి. వీటన్నింటిలో పూజ్యశ్రీ అమ్మగారు తప్పక పాల్గొనేవారు. వీటిని అనుసరించి తమ దినచర్యను, తాము చేసుకునే పారాయణ, నామజపాన్ని, గృహనిర్వహణ బాధ్యతలను, ముద్రణకు సంబంధించిన పనులను, సేవలను మలచుకునేవారు. ఒక్క క్షణం కూడా విశ్రమించేవారు కాదు. "నిరంతరం ఆయన సేవ చేసుకోవడం, స్మరణ చేయడం, వారి సన్నిధిని అనుభవించడం – ఇంతకంటే జీవితంలో ఏమి కావాలమ్మా? మనకెంతటి అవకాశమిచ్చారాయన?!" అనేవారు.

"అమ్మా! మీ దయవలన ఫలానావారికి ప్రాణాపాయం తప్పి ఆరోగ్యంగా వున్నారట. మీకు కృతజ్ఞతలు తెలుపమన్నారు" అని చెబితే, బాబాకు, పూజ్యశ్రీ మాస్టరుగారికి నమస్కరిస్తూ, "నాన్నగారు, బాబా తలచుకుంటే చేయలేనిదేమున్నది? అంతా మన ప్రార్థనలోనే వుందమ్మా. నిరంతరం ఆయనను ప్రార్థించుకోవడమే" అనేవారు. ఫలానావారికి మీ దయవల్ల అతను కోరిన ఉద్యోగం వచ్చిందట. మీకు నమస్కారాలు చెప్పమన్నారు అంటే "అంతా బాబా దయమ్మా. వాళ్లను మొదటినెల జీతం మంచి కార్యక్రమాలకు వినియోగించమన్నాను కదా! చెప్పావా?" అనేవారు. "మనం సాధ్యమైనంత వరకు స్వయంగా కష్టించి ఇతరులకు మంచి చేయడం నేర్చుకోవాలి. అంతేకాని మంచి పనులు చేసేవారికి మన

తరపున డబ్బులిచ్చి పని అయిపోయిందనుకోకూడదు. అలా చేయవచ్చుగాని, దానితోపాటు మనం కూడా మంచికార్యాలు చేయడం నేర్చుకోవాలి కదా!" అని అనేవారు. ఫలానావారికి ఈ లీల జరిగిందిటమ్మా! అంటే "ఆయన చేసే లీలలకేమి తక్కువ! వేరే లీలలవసరం లేదు – మన జీవితాలే పెద్ద లీల!" అనేవారు. 'ఆయన సర్వసమర్థుడు. ఎప్పుడూ ఆయన కృపకోసం దోసిలిపట్టి వినమ్రతతో వేచివుండాలి!' అని బోధించేవారు.

"అమ్మా! మీరు శారీరికంగా చాలా బాధపడుతున్నారమ్మా! అయినా అలా హాయిగా ఎలా వుండగలుగుతున్నారు?" అని అడిగితే, "అదేమిటమ్మా! నా ప్రార్థన మన్నించి ఎంతటి కర్మను ఈ వ్యాధిరూపంలో ఆయన తొలగించివేస్తున్నారో! ఆయన ఎంత కరుణామయుడు? అయినా నాకేమైంది? లేచి ఏ పనీ చేయనవసరం లేకుండా నన్ను మంచం మీదే వుండేలా చేశారు. నన్ను చక్కగా చూసుకునే మీ అందరినీ ఏర్పాటు చేశారు. అన్నీ ఆయనే నడిపిస్తున్నప్పుడు ఇక నాకు బాధ ఎందుకు? నేను నిరంతరం హాయిగా ఆయన స్మరణ, సేవ చేసుకుంటూ వుండవచ్చు. అందుకు ఆయనే అన్ని ఏర్పాట్లూ చేశారు. ఇంతటి అవకాశమిచ్చినందుకు ఆ సమర్థ సద్గురువుకు కృతజ్ఞతలు!" అంటూ గద్గద కంఠంతో, అశ్రుపూరిత నయనాలతో ఆయనకు అంజలి ఘటించేవారు. అంతటి కష్టమైన పరిస్థితులలోనూ ఎలా ఆలోచించుకోవాలో

మనకు బోధిస్తున్నారన్నమాట! పూజ్యశ్రీ మాస్టరుగారి వలెనే ఆమె రచనలు, బోధలు, ఆచరణ మనకు అనుక్షణము బోధ చేస్తూనే వుంటాయి.

పూజ్యశ్రీ మాస్టరుగారు జ్ఞానసూర్యునిలా ప్రకాశించి తమ ప్రభావంతో సాయితత్త్వ ప్రచారయజ్ఞాన్ని నేటికీ ఎలా దశదిశలా వ్యాపింపజేస్తున్నారో మనం చూస్తూనే వున్నాం. ఆయనను దర్శించగానే ఆయన ముఖంలోని తేజస్సు, ప్రవర్తనలోని దివ్యత్వము, ఆయన సన్నిధి ప్రభావము, ఆయన మాటలలో ప్రవహించే జ్ఞానమూ ఎదుటివారిని ఇట్టే పాదాక్రాంతుల్ని చేసుకునేవి. ఆయనను చూసిన ప్రతివారికీ ఆయన సామాన్యులు కారని అర్థమైపోయేది.

కానీ పూజ్యశ్రీ అమ్మగారు ఆ జ్ఞానసూర్యుని ప్రతిబింబించే చల్లని చంద్రునిలా ప్రశాంతంగా, ఆహ్లాదంగా, గంభీరంగా, నిండుగా వుంటారు. ప్రశాంతంగానూ, స్థిరంగానూ కనిపించే ఆమె ముఖంలో ఎటువంటి తేజస్సు, జ్ఞానము ప్రకటమవ్వవు. ఆమెలోని నిరాడంబరత, వినమ్రత, బిడియము, మితభాషిత్వము ఆమెలోని ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని అంతుబట్టనివ్వవు. దానిని తెలుసుకోడానికి అవసరమైన జిజ్ఞాసను కూడా కలిగించనంత సాధారణత్వం, సద్గుణ సంపన్నత్వం ఆమె స్వంతం.

పైగా పూజ్యశ్రీ అమ్మగారు తమంతట తాముగా తమ జీవితం గురించి, తాము చేసిన సేవ గురించి, సాధన గురించి, తమ అనుభవాల గురించి, తమకు పూజ్యశ్రీ మాస్టరుగారితో వున్న అనుబంధం గురించి, తమ ఆధ్యాత్మిక స్థితి గురించి ఎప్పుడూ మాట్లాడరు. కనుక ఎంతోకాలంగా ఆమెతో పరిచయమున్న వారు కూడా ఆమెను ఏ మాత్రం తెలుసుకోలేరు. అటువంటివారికి పూజ్యశ్రీ అమ్మగారిని వేలాదిమంది దైవంగానూ, గురురూపంగానూ పూజించడం, ఆమెకు సమాధి మందిరం నిర్మించడం ఒకింత ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు.

కానీ ఆమె నుంచి ఆ విషయాలను అడిగి తెలుసుకున్నప్పుడు మనకెంతో ఆశ్చర్యం కలుగుతుంది. ఆమె చేయని సేవ లేదు – తాపీ పని నుంచి పాకీ పని దాకా జిల్లెళ్లమూడిలో అన్ని సేవలూ చేశారు. ఆమెకు రాని పని లేదు. ఆమె చేయని సాధన లేదు – 'ధ్యానయోగ సర్వస్వం' గ్రంథంలో పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పిన సాధనలన్నీ పూజ్యశ్రీ అమ్మగారి చేత ఆయన చేయించిన అనేక రకాల సాధనలలో కొన్ని మాత్రమే! ఆమె ఎంతమంది మహాత్ములను దర్శించారో ఎన్ని దీక్షలు చేశారో! ఆమెకు ఎన్ని ఆధ్యాత్మిక అనుభవాలున్నాయో!

> ఎంతో గొప్ప మహాత్ములైన శ్రీ సుధీంద్రబాబుగారు పూజ్యశ్రీ అమ్మగారిని, 'ఆమె సామాన్యురాలు కాదు, ఎంతో గొప్ప మహనీయురాలు!'అని కీర్తించారు. నాగ్‌పూర్‌కు చెందిన సంత్ శ్రీ గులాబ్ బాబా కూడా పూజ్యశ్రీ అమ్మగారిని సాక్షాత్తూ అలివేలు మంగాదేవిగా పూజించి సాష్టాంగప్రణామాలు అర్పించారు. పరాడ్‌సింగాకు చెందిన శ్రీ అనసూయామాత ఆమెను పూలతో అభిషేకించారు.

పూజ్యశ్రీ మాస్టరుగారితో కొద్ది సాంగత్యం కలిగినంతమాత్రాననే మనమెంత విర్రవీగుతామో! అంతటి మహానుభావుడే శ్రీ సాయినాథుని శిష్యునిగా వుండదలచినప్పుడు ఆయన సాంగత్యం వలన విలువ, గుర్తింపు, పొందిన మనం గురువులమవ్వదలచడం ఎంతటి అవివేకం? ఎంతటి సిగ్గుచేటు? అటువంటప్పుడు పూజ్యశ్రీ అమ్మగారి ముందు మనమెంత? పూజ్యశ్రీ మాస్టరుగారితో ఆమెకున్న సాంగత్యం ముందు మన సాంగత్యమెంత? సాక్షాత్తూ సాయినాథుడే సూచించిన ఆమె ఔన్నత్యం ముందు మనమెంత? మనమే పూజ్యశ్రీ మాస్టరుగారి వద్ద ఇంత పొందివుంటే ఆమె ఇంకెంత పొందివుండాలి? ఆమె స్థితి ముందు మన స్థితి ఎంతటిది?

మనలాంటి సామాన్యులకు భగవంతుడు లేదా సద్గురువు మానవరూపంలో వచ్చినప్పుడు వారిని గుర్తించడం చాలా కష్టం. వివేకంతో గుర్తించినా ఆ భావాన్ని ఎప్పుడూ

గుర్తించుకుని వారితో వ్యవహరించడం మరింత కష్టం. ఒక పక్క తమ దివ్యత్వాన్ని అంతరాంతరాలలో అనుభవిస్తూనే శరీరపరిమితులై మనతో వ్యవహరించేటప్పుడు తమ తమ పాత్రలను పోషించడంలో శారీరక ధర్మాలైన ఆకలిదప్పులను, కష్టసుఖాలను, ఆరోగ్య అనారోగ్యాలను అనుభవిస్తుంటారు. అన్నింటికీ అతీతులై వుంటూనే మరలా వాటిలో తన్మయులై వుంటూ అన్నింటినీ అనుభవిస్తుంటారు. వారికి ఎదురయ్యే రకరకాల పరిస్థితులలో లౌకికంగా వ్యవహరిస్తూనే వాటిపట్ల నిర్లిప్తులై ఆంతర్యంలో పొంగుకుంగులు లేక వాటిని ధైర్యంగాను, ఉత్సాహంగానూ ధర్మంగానూ ఎదుర్కొంటారు. అంతులేని తృప్తి శాంతులను అనుభవిస్తుంటారు. ఈ విషయాన్ని నిజమైన మహాత్ముల జీవితాలు నిరూపిస్తాయి.

ఈ విషయాన్ని ఆలోచించుకుని మన అవివేకాన్ని ప్రశ్నించుకుని ఆమెను గమనించయత్నించినపుడు ఆమె యొక్క అసలైన తత్త్వం మనకు తెలియడం మొదలుపెడుతుంది. జాగ్రత్తగా పరిశీలిస్తే ఆమె జీవితము, బోధలు, ఆమె పవిత్ర సన్నిధిలో జరిగే లీలలు, ఆమె ప్రసాదించే ఆధ్యాత్మిక అనుభవాలు – అన్నీ పూజ్యశ్రీ మాస్టరుగారి అర్ధాంగిగాను, మాకు తల్లిగాను, గురుపత్నిగాను, గురుస్వరూపిణిగాను ఆమె నిర్వర్తించే అనేక పాత్రలలో లౌకిక వ్యవహారాల మాటున దాగి వున్నాయని క్రమంగా అర్థమౌతుంది. ఆమె సన్నిధిలో వున్న కొద్దీ నెమ్మదిగా ఆమె ప్రభావం మనకు అనుభవమవడం మొదలౌతుంది. క్రమంగా అది అత్యంత బలోపేతమై మన జీవితాలనే మార్చి వేస్తుంది. చివరకు ఆమెయే పూజ్యశ్రీ మాస్టరుగారి మరో రూపమని తెలుస్తుంది.

అందుకే శ్రీ సాయినాథుడు పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రతిరూపంగా పూజ్యశ్రీ అమ్మగారిని మన మధ్య నిలిపారు. ఆమెను ఆయన అర్ధాంగిగా సూచించినపుడే శ్రీ సాయినాథుడు, శ్రీ పాకలపాటి గురువుగారు ఆమె స్థితిని ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని మనకు చెప్పకనే చెప్పారన్నమాట! ఎంతో గొప్ప మహాత్ములైన శ్రీ సుధీంద్రబాబుగారు పూజ్యశ్రీ అమ్మగారిని, "ఆమె సామాన్యురాలు కాదు, ఎంతో గొప్ప మహనీయురాలు!" అని కీర్తించారు. నాగ్‌పూర్‌కు చెందిన సంత్ శ్రీ గులాబ్ బాబా కూడా పూజ్యశ్రీ అమ్మగారిని సాక్షాత్తూ అలివేలు మంగాదేవిగా పూజించి సాష్టాంగప్రణామాలు అర్పించారు. పరాడ్‌సింగాకు చెందిన శ్రీ అనసూయామాత ఆమెను పూలతో అభిషేకించారు. అవధూత శ్రీ మాయీ

అమ్మ స్వయంగా తమ వాహనం దిగి నడచివచ్చి పూజ్యశ్రీ అమ్మగారికి తమ దర్శనం ప్రసాదించారు. కానీ ఆమె పూజ్యశ్రీ అమ్మగారికి దర్శనమనుగ్రహించారో, తామే ఆమెను దర్శించారో ఎవరికెరుక.

ఆమె స్థితి అంతటిది కనుకనే ఆమె తమ మహిమలను ప్రదర్శించకపోయినా, ఏ ఉపన్యాసాలూ ఎక్కువగా చెప్పకున్నా, ఎంతోమంది ఆమె సన్నిధికి ఆకర్షితులై ఆమె కరుణకై ఉవ్విళ్ళూరుతున్నారు. పువ్వులకు పరిమళంలా సహజంగా ఆమెనుంచి వెలువడే ఆధ్యాత్మిక ప్రభావం ఎందరిని సన్మార్గం వైపు నడిపించిందో ఎవరికి తెలుసు? ఇప్పటి వరకు ఆమె సశరీరంగా చేసిన లీలలను, బోధలను అనుభవించగలిగే, వినగలిగే భాగ్యం మనందరికీ ప్రసాదించారు. ఇకముందు సమాధి స్థితులై, శాశ్వతులై ఏ లీల చేయనున్నారో! ఏ బోధ చెప్పనున్నారో!

జై సాయి మాస్టర్!

నిత్య సనాతనా! ధర్మస్వరూపా!! సాయినాథ దేవా!!!

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

సృష్టిలోఅనుక్షణముఎన్నిరూపాలుపుట్టినశిస్తున్నాఅవన్నీ దేనివలన పుడతాయో, దేనివలన పెరుగుతాయో, తర్వాత క్షీణించి నశిస్తాయో అట్టి మూలకారణం ఎప్పుడూ చెక్కుచెదరక అలానే వుంటుంది. దానినే సత్యం అంటారు. ఈ జగన్నాటకానికంతటికీ కీలకము, శక్తి, బీజము అదే. అది సృష్టి మొదటిలో మాత్రమే వున్నదని పొరబడకూడదు. అది సృష్టిలో ప్రతిక్షణము జరిగే మార్పే! అట్టి మార్పులు ఏ వస్తుజాలమంతటా మరియు మనలోను కనిపిస్తాయో అట్టి వస్తుజాలమే దాని ఉనికికి నిదర్శనము. దీనికొక పోలిక – మనలో ప్రకటనమయ్యే జీవశక్తే మనము. మన దేహములో జరిగే ప్రతిస్పందన, మన మనస్సులో జరిగే భావసంచలనము, అవి దేనిలో జరుగుతాయో అట్టి జీవకణాలు – ఇవన్నీ కూడ జీవశక్తి యొక్క ఉనికికి నిదర్శనాలయినట్టు,

సర్వానికి మూలము, ఆధారముయై ఏది శాశ్వతముగా అదేరీతిన వున్నదో అట్టి మూలసత్యమే పరమాత్మ. అదే సత్యం. దానివలన జరిగే మార్పులే, క్రియలే అనంతమయిన

వస్తుజాలము. దానివల్లనే, దానినుండే పంచభూతాలు మరియు వాటి సమ్మేళనములయిన వస్తుజాలము, ఈ విశ్వము ఏర్పడింది; కొనసాగుతుంది. ఇన్నింటికి కారణమయిన మూలసత్యాన్ని మరచి, దానివలన జరిగే వస్తుజాలము యొక్క ఉత్పత్తి, స్థితి, లయాలను మాత్రమే మనము సామాన్యముగా గుర్తించ గలుగుతాము. అదే అజ్ఞానమంటే! ఇన్నింటికీ మూలము ఆధారముగా అనుక్షణము నిలిచి వుండే పరమసత్యాన్ని ఎప్పుడు దృఢంగా హృదయంతో గుర్తిస్తూ వుండటమే జ్ఞానము. అలా మహాత్ములచేత గుర్తించబడి, చెప్పబడే సత్యం సనాతనము. అంటే అనాదిగా ఈ విశ్వమంతటికి ఆధారంగా నిలుస్తుంది. అది కించిత్తుకూడ మార్పు చెందకుండా ఇప్పుడు జరిగే మార్పులన్నింటికి ఆధారంగా నిలచియున్నది. ఎప్పటికి నిలిచే వుంటుంది. అందుకే అది నిత్య నూతనము గూడా. ఏది సత్యమో అది నిత్యము, సనాతనము, నిత్య నూతనము.

అయితే ఈ విషయంలో పెద్ద పెద్ద చదువుకున్నవారు కూడా ఎప్పుడు భ్రమిస్తూనే వున్నారు. ఈ సత్యం సృష్టి ఆరంభంలో మాత్రమే వుండినదని, అప్పుడు మాత్రమే మహర్షులగాను వారిద్వారా వెలువడిన వేదం గాను, వెనుకటి అవతార పురుషులుగాను మాత్రమే వెల్లడయిందని వీరు భ్రమిస్తున్నారు. కనుకనే ఆ పరమాత్ముడు తమకాలంలో అవతరించినా, ఎక్కువ మంది ఆయనను గుర్తించి అంగీకరించలేకపోయినారు. అంగీకరించలేకపోవడమంటే వాచా, కర్మణా నిరాకరించడం మాత్రమే కాదు; హృదయపూర్వకంగా అట్టి భావనతో వ్యవహరించకపోవడమే. అదే సాయిచరిత్రలోనూ జరుగుతూ వచ్చింది. ఆ పరమాత్మ శ్రీసాయిగా ప్రకటమయినపుడు దాసగణువంటి భక్తుడు, విద్యావంతుడుగూడా వారిపాదాలనుండి వెలువడ్డ గంగను శిరస్సున చల్లుకున్నాడేగాని తీర్థంగా సేవించలేక పోయాడు. ఇదే కలిమహిమ. రాముడిని, కృష్ణుడిని వారి సమకాలికులైన ఋషులు గుర్తించ గలిగారేగాని ఎక్కువమంది వారిని మానవమాత్రులుగానే తలచారు. ఇట్టి అజ్ఞానంతో ఈనాటికి గూడా స్నానము, అనుష్ఠానము, పూజ, ఆచారములేని సాయి నిత్యసనాతుడయిన ఆ పరమాత్మ ఎలా అవుతారని సందేహించేవారు వున్నారు. మన సనాతన ధర్మానికి ప్రతీక, ప్రతినిధి అయిన దత్తాత్రేయుడు సాయిగా అవతరించారని అంగీకరించలేకున్నారు. అందుకే, “మనకు సనాతనంగా వస్తున్న రాముడు, కృష్ణుడు వంటి అవతార పురుషులు, దేవతలు, ఋషులు, వారు చెప్పిన మరియు ఆచరించి చూపిన శిష్టాచారము వుండగా మనము ఈనాడు క్రొతగా వచ్చిన సాయిని ఆశ్రయించడము ఏమిటి?” అన్న శంక ఎందరినో లోలోపల వేధిస్తుంది.

ఇందుకు కారణం సాయి తమ వేషభాషలలో శిష్టాచారాన్నుండి విభిన్నులుగా కనిపించడమే. ఇట్టి శంక మిగిలున్నంతవరకు మన విశ్వాసము సంపూర్ణము కానట్లే. అది సాయియందు విశ్వాసము లేకుండ వుండటమే కాదు అసలైన సనాతన ధర్మ మెట్టిదో తెలియక పోవడమే. అది నిత్యనూతనముగూడా అని గుర్తించకపోవడమే. అది నిత్యనూతనము గాకపోతే - ఎప్పుడో (జరిగిన) వెనుకటి కాలంలో వున్నదయితే - అది శాశ్వతము ఎలా అవుతుంది. శాశ్వతముగానిది సత్యమెలా అవుతుంది? శాశ్వతముగానిది మృతము, అసత్యము అవుతుంది. అంటే ఇలా శంకించే వారు అసత్యాన్నే సత్యంగా భ్రమించారన్నమాట. అది సత్యస్వరూపమయిన పరమాత్మయందు, ఆయన రూపమైన శాశ్వతధర్మమందు అవగాహన, విశ్వాసము లోపించడమే.

ఒక్క విషయము ఆలోచిస్తే బాగా అర్థమవుతుంది. కృష్ణుడుగా అవతరించిన పరమాత్మ ఈ విశ్వమంతా తన రూపమేనని అర్జునుడు మొదలయిన వారికి దర్శనమిచ్చి నాడు. అందుకే ‘విశ్వం’ అన్న నామంతోనే విష్ణు సహస్ర నామము మొదలవుతుంది. కాని నాటికి, నేటికి ఈ విశ్వ మెంతో మారిపోయింది. భూమిపైన వున్న దేశకాల పరిస్థితులలోనే ఎంత మార్పు వచ్చిందో మనము చూస్తూనే, వున్నాము. అయినా శ్రీకృష్ణుని నాటి విశ్వమే పరమాత్మ - అని, నేటి విశ్వం పరమాత్మగాదని అనగలమా?

అలా అంటే క్రమంగా విష్ణుసహస్ర నామాలలో ఒక్కొక్కటే నిత్యసత్యాలు గాకుండా పోతాయి. భగవంతుని అసలయిన నామాలు గాకుండా పోతాయి. వస్తుజాలము యొక్క రూపురేఖలలో ఎన్ని మార్పులు వచ్చినా ఈ విశ్వంగా పరమాత్మయే వున్నాడని ఆ నామానికర్థము. ఆనాడు అప్పటి విశ్వం యొక్క రూపంలో వున్న పరమాత్మయే కృష్ణుడుగా ప్రకటమయినట్లు, ఈనాటి విశ్వం రూపంలో వున్న ఆ పరమాత్మయే సాయిగా అవతరించారు. వృద్ధురాలయిన ఒక తెలివి తక్కువ ఇల్లాలు 18వ ఏట తన మెడలో తాళిగట్టిన ఆ యువకుడు మాత్రమే తన భర్తనీ, ఈనాడు వృద్ధుడుగా వున్న భర్త తన అసలయిన భర్తగాడని తలచినట్లే వుంటుంది.

ఇంత అపోహకు కారణం సాయియొక్క వేషభాషలు,

ఆచరణ క్రొత్తగా వుండటమే. దానికి సాయి సమాధానము చెప్పేయున్నారు- “జైసా దేశ్ వైసా వేష్” అంటే “దేశ కాల పరిస్థితులకు అనుగుణమయిన రూపంలో ప్రకటమయ్యాము” అన్నారు. అది గుర్తించక మన వెనుకటి ధర్మశాస్త్రాలలో చెప్పబడిన రీతిన ఆయన ఆచరించలేదు కదా అని మనము శంకిస్తాము. ఈ విషయంలో మనము విశ్వసిస్తున్నాము అని భ్రమిస్తున్న శ్రీ కృష్ణుడు భగవద్గీతలో చెప్పియున్నది నేడు చదువుకున్నవారు మరుస్తున్నారు. సనాతనధర్మంలో పరిశుద్ధుడు కాదలచిన వారు అనుష్ఠించి ఆచరించవలసినవి పంచయజ్ఞాలు. అవి సాయి ఆచరించలేదు కదా అని మనము అంటాము. యజ్ఞం గురించి భగవద్గీత 4వ అధ్యాయంలో 24 నుండి 33వ శ్లోకము వరకు వివరించియున్నారు. యజ్ఞమన్నది ద్రవ్యయజ్ఞము మరియు తపోయజ్ఞమని రెండు విధాలని చెప్పబడింది. యజ్ఞపాత్రలు, హోమము చేసే పదార్థాలు, హోమము చేసేవాడు, అతడు పొందవలసిన ఫలితము బ్రహ్మరూపాలేనన్న భావంతో కొందరు ద్రవ్యయజ్ఞము చేస్తారు. ద్రవ్యం అంటే భౌతిక వస్తువులు, పదార్థాలు. మరి కొందరు యోగులు బ్రహ్మమనే అగ్నియందు కర్మయనే హవిస్సును హోమం చేస్తారు. మరికొందరు జ్ఞానేంద్రియ నిగ్రహమనే అగ్నియందు ఇంద్రియ విషయాలను, ప్రాణాలయొక్క క్రియలను వాటికి మూలకారణమయిన ఆత్మ యందు నిలుపబడిన నిష్ఠ అనే యగ్నిలో హోమము చేస్తారు. ఈ విధంగా యజ్ఞము -- ద్రవ్యయజ్ఞము, తపోయజ్ఞమని రెండు విధములని శ్రీ కృష్ణుడు చెప్పాడు. అలానే దానము, శరీరాన్ని శుష్కింపనీయటము, ప్రాణాయామము వేదపారాయణ, ఇంద్రియజయము ఆహార నియమములు గూడా యజ్ఞాలే అని శ్రీకృష్ణుడు (శ్లో 28, 29లో) చెప్పాడు.

అంటే బాహ్యమయిన ఆచరణ మాత్రమే యజ్ఞము కాదని, ఇంద్రియనిగ్రహము, ఆత్మనిష్ఠ, సర్వము పరమాత్మ అన్నభావంలో ఎప్పుడూ జీవించడము కూడ సనాతన సంప్రదాయబద్ధమైన యజ్ఞాలేయని శ్రీ కృష్ణుడు స్పష్టంగా చెప్పే యున్నాడు.

ఇక అట్టివి మాత్రమే ఆచరించిన సాయి సనాతనుడు ఎందుకు కాదు? అంతేగాక 33వ శ్లోకంలో ద్రవ్యయజ్ఞము కంటే జ్ఞానయజ్ఞమే శ్రేష్ఠము అని దృఢంగా శ్రీ కృష్ణుడు స్పష్టం చేసియున్నాడు. ఈ విషయంలో సంశయ విచ్ఛేదము కావడానికి బ్రహ్మజ్ఞాని అయిన సద్గురువును శరణు పొంది సేవించి, పరిప్రశ్న చేసి తెలుసుకోవాలని 34వ శ్లోకంలో శ్రీకృష్ణుడు చెప్పాడు. ఇది చదివి కూడా అలా చేయని మనము ఏది సనాతన ధర్మమో నిర్ణయించగలమా! శ్రీ కృష్ణుడు స్పష్టంగా చెప్పినదిగూడ మనకు ప్రమాణంగాకపోతే సనాతన ధర్మంగూడా ప్రమాణం కాదన్నమాట! అధ్యాయము 5:18,19 శ్లోకాలలో చెప్పిన స్థితి సాయియందు అనుక్షణము ప్రకటమయ్యింది కదా! సర్వజీవులయందు సమానంగా పరమాత్మనే దర్శించగలవారు మాత్రమే పండితులని గీత చెప్పింది. ఆ సంగతే అధ్యాయము 6:29-31 శ్లోకాలు వివరిస్తాయి. అట్టి పరమయోగులందరిలో అన్ని జీవులను తన రూపంగా దర్శించగలవాడే ఉత్తముడని 32వ శ్లోకము చెబుతుంది. అందుకే సాయి యోగీశ్వరుడు. ఇట్టి ఉత్తమమయిన కర్మము యొక్క తత్త్వమెరుగక చదువుకున్న వారుకూడ శ్రీ కృష్ణుని కాలంలో కూడా భ్రమించారని అధ్యాయము 4,16వ శ్లోకం తెలుపుతుంది. చివరకు

బాహ్యమయిన ఆచరణ మాత్రమే యజ్ఞము కాదని, ఇంద్రియనిగ్రహము, ఆత్మనిష్ఠ, సర్వము పరమాత్మ అన్నభావంలో ఎప్పుడూ జీవించడము కూడ సనాతన సంప్రదాయబద్ధమైన యజ్ఞాలేయని శ్రీ కృష్ణుడు స్పష్టంగా చెప్పే యున్నాడు.

అధ్యాయము 3:17,18 శ్లోకాలలో అటువంటి బ్రహ్మనిష్ఠునకు బాహ్యకర్మములు ఆచరించినందువలన లాభముగాని నష్టముగాని ఉండదని స్పష్టంగా చెప్పారు. అటువంటప్పుడు మనకు తోచిన ఆచారాన్ని, అది శ్రీ కృష్ణుడు చెప్పిన దానికి భిన్నమయినా, సాయి ఆచరించనందుకు మనము ఆయనను శంకించడం సాయిని శంకించడమే గాక, సనాతన ధర్మాన్ని భగవద్గీతను గూడా శంకించినట్లే గదా! ఇంతకూ సాయి సదాచారము పాటించలేదన్న మన అభిప్రాయమైనా వాస్తవమేనా? ●

ధర్మమూర్తి

శ్రీమతి శ్రీదేవి

ఆంధ్రదేశంలోని గుంటూరు పట్టణానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామం మన్నవ. మన్నవ గ్రామం ఎందరో మహనీయులకు, ఋషి పుంగవులకు నిలయం. చక్కని దేవాలయాలతో, పచ్చని పంట పొలాలతో, స్వచ్ఛంగా పారే సెలయేళ్లతో, భక్తి తత్పరులైన మహిళామతల్లులు, ధర్మాత్ములై జీవించే ప్రజలతో అలరారుతుంది చిన్న గ్రామం మన్నవ. ఆ గ్రామమే మన శ్రీ భరద్వాజ గురుదేవుల ధర్మపత్ని, మా అక్కగారు అయిన శ్రీ అలివేలు మంగతాయారు గారి జన్మస్థలం. ఆ గ్రామ వాస్తవ్యులైన శ్రీ మన్నవ బాలకృష్ణ శర్మగారు, శ్రీమతి రంగనాయకమ్మగారు అనే పుణ్యదంపతులకు కుమార్తెయే మన మాతృశ్రీ అలివేలు మంగమ్మ గారు.

అలివేలు మంగమ్మగారి వంశస్థులలో చాలామంది దైవ సాక్షాత్కారం పొందిన మహాభక్తులు, యోగులు

అయివుండటం వలన వంశానుగతంగా అలవడిన ఆధ్యాత్మిక చింతన చిన్నతనం నుండే ఆమెలో ప్రస్ఫుటమవుతుండేది. దానికి తోడుగా మా కుటుంబమంతా జిల్లెళ్ళమూడి వాస్తవ్యురాలైన రాజరాజేశ్వరి ఉపాసకురాలు జిల్లెళ్ళమూడి అనసూయమ్మగారి పట్ల భక్తి ప్రపత్తులు కలిగి, తరచు జిల్లెళ్ళమూడి వెళ్ళి వస్తూండేవాళ్ళు. మన్నవ గ్రామ వాస్తవ్యులు, శ్రీ బాలకృష్ణ శర్మగారి పినతండ్రిగారైన శ్రీ మన్నవ సీతాపతి శర్మగారి కుమార్తె జిల్లెళ్ళమూడి అనసూయమ్మ. ఆమె భర్త బ్రహ్మాండం నాగేశ్వరరావుగారు జిల్లెళ్ళమూడి గ్రామ కరణం అవటం వలన ఆమె జిల్లెళ్ళమూడి అమ్మగా ప్రసిద్ధి గాంచారు. ఆమె మాకు దగ్గర బంధువు, వరుసకు మేనత్త అవడం వలన మా రెండు కుటుంబాల మధ్య రాకపోకలుండేవి. మహిమాన్వితురాలైన జిల్లెళ్ళమూడి అమ్మ నుండి మా కుటుంబంలోని అందరు ఆధ్యాత్మిక సాధనావిధానాలు, మంత్రదీక్షలు పొందటం జరిగింది. అలా ఆధ్యాత్మిక వాతావరణంలో ఉన్న మా కుటుంబంలో ఎప్పుడూ భక్తి ప్రసంగాలు, దైవచింతన జరుగుతుండేవి.

ఆధ్యాత్మిక చింతనకు మొట్టమొదటి ఆలంబనం జీవితాకర్షణలపట్ల నిర్లిప్తత, వైరాగ్యం! సుఖజీవనం సాగించేవారికయితే ఆ జీవితానందాలకే నిరంతరం అంటిపెట్టుకుని వుండాలనిపించటం, కష్టజీవులకు జీవిత సుఖాలు అనుభవించాలని ఆశ తపన! ఇక మానవులందరికీ ఆత్మీయ, స్వజనుల పట్ల మమతానుబంధాలు!!--- వీటన్నింటి పట్ల ఎంతో కొంత నిర్లిప్తత వున్నవారే ఆధ్యాత్మిక జీవితంవైపు మొగ్గుతారనిపిస్తుంది. ఒక మహాత్ముడు చెప్పినట్లు కాముడు, రాముడు ఒకేచోట నిలువరు కదా!

ఆధ్యాత్మికత, కాలాంతరంలో జిల్లెళ్ళమూడి అమ్మపై భక్తి అనే ప్రపంచంలోకి ఆకర్షింపబడటానికి ముందుగా ఆమెలోని వైరాగ్యము, ధర్మాచరణ పట్ల అంకితభావాలే పునాదిరాళ్ళుగా ఆ దివ్య సౌధ నిర్మాణానికి కారణభూతాలనేది విస్పష్టం.

చిన్న వయసు నుండి ఆడంబరాలకు, సుఖసౌఖ్యాలకు దూరంగా వుండే ఆమె కుటుంబసభ్యుల కష్టసుఖాల పట్ల ఎంతగానో స్పందించేవారు. పెద్ద కుటుంబం! అంతా చిన్నపిల్లలు! అమ్మ ఒక్కతే కష్టపడుతుండటం చూడలేక ఆ చిన్న వయసులోనే తనకు చేతనైన పనులు అందుకుంటూ అమ్మకు సహాయపడేవారు అలివేలు మంగమ్మగారు. తల్లిదండ్రులు, తాతముత్తాతలు అద్భుతమైన వితరణశీలురు.

వందల ఎకరాల భూ సంపద, అధిక సంఖ్యలో పాడి గేదెలు, ఆవులు! అలా సుసంపన్నంగా వుండేది ఆ కుటుంబం! ప్రతినిత్యం వచ్చే అతిథి, అభ్యాగతులు, ఎప్పుడూ ఇంటి నిండా బంధుజనులు, పేదప్రజలను ఆదుకునే దయాశీలత--ఇలాంటి పరిస్థితులలో కేవలం దానధర్మాలకు సంపదంతా కరిగిపోయింది.

మా తరం వచ్చేసరికి మధ్యతరగతి కుటుంబంగా మిగిలిపోయిన ఆ స్థితిలో ఆర్థిక ఇబ్బందులు చూసి అక్కయ్య హృదయం తల్లడిల్లేది. ఎంతగా అంటే త్వరగా చదువు పూర్తిచేసి ఏదో ఒక ఉద్యోగం సంపాదించి నాన్నకు ఆర్థికంగా సహాయపడాలి...(అప్పట్లో - అంటే జిల్లెళ్ళమూడి వెళ్ళటానికి ముందు) నిరంతరం అదే ఆమె తపన! ఎప్పుడూ అదే ఆమె ఆరాటం. చిన్నవారమైన మమ్మల్ని కూడా ప్రోత్సహిస్తూ నాన్న కష్టపడుతున్నారనీ, బాగా చదివి పైకి రావాలని చెబుతుండేవారు ఆమె. గుంటూరు హిందూ కాలేజీ హైస్కూల్ లో S.S.L.C వరకు చదివారు. చదువుపై చక్కని

ఏకాగ్రత, శ్రద్ధ ఉండేవి. తన దస్తూరి ఎంత బాగుండేదో! Hand-writing పోటీలో ప్రథమ బహుమతి వచ్చింది.

ఇక ఆధ్యాత్మికతకు ముఖ్య సోపానమైన ధర్మాచరణ అనే అంశం పరిశీలిస్తే, ఆమె జీవిత విధానమే ధర్మాచరణకు ప్రతిరూపం. ఈ సందర్భంగా ఆమె చిన్న వయసులో జరిగిన ఒక విషయం- నేను విన్నది చెబుతాను (అంటే అప్పటికి నాది చాలా చిన్న వయసు కనుక). ఆ రోజుల్లో ప్రతి ఇంట్లో ఒక బావి వుండేది. ఆ గిలక బావుల నుండి తాడుతో నీళ్లు తోడుకొని వాడుకుంటుండేవారు.

మా ప్రక్క ఇంట్లో వున్న నడవలేని ముసలమ్మతో ఆ ఇంట్లోని వారు నీళ్లు ప్రతిరోజు తోడిస్తూ వుండేవారట. ఆమె నిలబడలేక బావి ప్రక్కనే కూర్చుని అతికష్టంతో నీళ్లు తోడుతుంటే చూస్తున్న అమ్మగారు గబగబా వెళ్లి ఆమెకు సహాయపడేవారట. ఆ ఇంట్లోని వారి గురించి, "వీళ్ళు ఈమె పట్ల ఎంత పాపం చేస్తున్నారో కదా!" అనేవారట.

మరొక సంఘటన నాకు గుర్తున్నది చెబుతాను. మా ప్రక్క ఇంట్లో చాలామంది కుటుంబ సభ్యులతో ఒక ధనవంతుల కుటుంబం నివసిస్తుండేది. ఆ ఉమ్మడి కుటుంబంలో మంచానపడిన ఒక శతవృద్ధుడు ఉండేవాడు. ఒకరోజు మా ఇంట్లో చేసిన ఒక పిండివంటను మాతో ఎంతో స్నేహంగా వుండే ఆ ప్రక్క ఇంటి వాళ్లకు కూడా యిచ్చాము. దానిని వాళ్ళ ఇంట్లోని ప్రతి ఒక్కరూ తీసుకోవటమే కాకుండా మంచంలో ఉన్న ఆ శతవృద్ధునికి కూడా బ్రతిమిలాడి తినిపిస్తున్నారు. ఆ దృశ్యం చూసిన అమ్మగారు నాతో, "చూసావా ఇది ధర్మం అంటే! ఈ పిండివంట యీ తాతగారి దాకా చేరింది. ఆ.. ఏమి తింటాడులే, ఏమి యివ్వాలిలే! అనుకోకుండా ఎంతప్రేమగా శ్రద్ధగా బ్రతిమాలి తినిపిస్తున్నారో! ధర్మమంటే యిది" అన్నారు.

ఆ తర్వాత ఆమె జీవితం అనూహ్యంగా మలుపు తిరిగింది. 16-17 సంవత్సరాల వయస్సులో అలివేలు మంగమ్మగారు ఒకసారి కుటుంబ సభ్యులతో జిల్లెళ్ళమూడి వెళ్లారు. కొద్దిరోజులు అమ్మ సన్నిధిలో గడిపిన అనంతరం కుటుంబ సభ్యులంతా గుంటూరు తిరిగి వచ్చారు. అంటే మా నాన్నగారు గుంటూరు జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తూ వుండటం వలన కుటుంబం గుంటూరులో నివసిస్తూవుండేది. అయితే

అలివేలు మంగమ్మగారు మాత్రం గుంటూరు తిరిగి వెళ్లక అమ్మ సన్నిధిలోనే వుండిపోయారు. చాలాసార్లు మా తల్లిదండ్రులు ఆమెను ఇంటికి తీసుకురావటానికి ప్రయత్నించినా ఆమె వెళ్ళలేదు. ఆమెలో అంతకు ముందు దాకా తల్లిదండ్రుల కష్టసుఖాల పట్ల వున్న తీవ్ర ఆందోళన, తపన ఏమైపోయాయో! ఆమె హృదయం అమ్మ సన్నిధికి అంకితమై పోయింది. అలా ఏడు సంవత్సరాల కాలం గడచిపోయింది.

జిల్లెళ్ళమూడిలో ఆమె గడిపిన జీవితం గురించి తలచుకుంటే ఎంతో ఆశ్చర్యం వేస్తుంది. ఒక సాధారణ 16 సంవత్సరాల బాలిక అలా జిల్లెళ్ళమూడి అమ్మనే తన సర్వస్వంగా భావించి, నిరంతరం నామస్మరణ చేసుకుంటూ, నిరంతరం సేవలో నిమగ్నమై, నిద్ర, ఆహారం, విశ్రాంతి లెక్కచేయక శక్తికి మించిన శ్రమను ఆనందంగా భరిస్తూ గడపడం అసాధారణమైన విషయం అనటంలో సందేహం లేదు. ఆ రోజులలో పచ్చని శరీరచ్ఛాయతో నవనవలాడే శరీరం ఎముకల పోగు అయింది. నల్లగా మోకాళ్ళవరకు పొడవుగా ఉండే తలవెంట్రుకలు పూర్తిగా రాలిపోయి ఎరుపు రంగులోకి మారిపోయాయి. ఆశ్రమ నిర్వాహకులు ఆశ్రమంలో వుండే వారికి మంచి పోషకాహారం అందించలేక పోయేవారు. అందుకు కారణం ఆ రోజుల్లో ఆశ్రమానికి తగినన్ని నిధులు లేకపోవడమే. అలాంటి పరిస్థితులలో ఆమె శరీరం పూర్తిగా శుష్కించిపోయి, చివరకు తీవ్ర అనారోగ్యం పాలయ్యింది. ఆ సమయంలో జిల్లెళ్ళమూడి అమ్మ శ్రీ అలివేలుమంగమ్మ గారికి ఎంతో నచ్చజెప్పి వైద్యం నిమిత్తం మా ఇంటికి - బనగానపల్లెకు పంపించడం జరిగింది.

ఆ సమయంలో మా పెద్ద అన్నయ్యగారు బనగానపల్లెలో ఒక టుబాకో కంపెనీలో పని చేస్తున్నారు. నాన్నగారు అంతకు కొద్ది సంవత్సరాల క్రితమే స్వర్గస్థులైనారు. నాన్నగారు స్వర్గస్థులైనప్పుడు శ్రీ అలివేలు మంగమ్మగారిని ఇంటికి తీసుకువెళ్లేందుకు ఆమె బంధువులు జిల్లెళ్ళమూడి వచ్చారు. అప్పుడు ఆమె తాను జిల్లెళ్ళమూడి అమ్మను విడిచి క్షణం కూడా వుండలేనని, నాన్నగారి ఆత్మ అమ్మలో ఐక్యం అయి వుంటుందని, కనుక తనకు తన తండ్రి గురించి బెంగ లేదని, తాను అమ్మను విడిచి రానని దుఃఖిస్తుంటే జిల్లెళ్ళమూడి అమ్మయే ఆమెకు నచ్చజెప్పి తండ్రి అంత్యక్రియలకు హాజరై, ఆ వెంటనే తిరిగి

జిల్లెళ్ళమూడి రమ్మని చెప్పి పంపడం జరిగింది. ఆమె ఆ విధంగానే తిరిగి జిల్లెళ్ళమూడి వెళ్లారు. ఆ తర్వాత కొన్నేళ్ళకు వైద్యం నిమిత్తం ఆమెను బనగానపల్లె పంపారు అమ్మ.

బనగానపల్లెలో కూడా ఆమె తన ఆధ్యాత్మిక సాధన కొనసాగించారు. నిరంతరం దైవచింతన, దైవపూజలు సద్గ్రంథ పఠన, జపధ్యానాలు- ఇది ఆమె దినచర్య! ఆ అద్భుత ఆధ్యాత్మిక సాధన ఆమెను ఉన్నత శిఖరాలకు చేర్చి, చివరకు సాక్షాత్తు దైవానికి చేరువ చేసింది. సాక్షాత్తు దత్తావతారులైన శ్రీ భరద్వాజ గురుదేవుల సహధర్మచారిణిగా ఆమెను మహనీయులైన చీరాల స్వామి, పాకలపాటి గురువుగారు, శ్రీ సాయినాథుడు నిర్ణయించి ఆమెను అత్యున్నత స్థానాన్ని అధిరోహింప చేశారు.

సద్గురు సాయినాథుని ప్రియ శిష్యులు, మహనీయులు, దత్తావతారులు శ్రీ భరద్వాజ గురుదేవులతో కేవలం సాయినాథుని ఆదేశం ప్రకారం శ్రీ అలివేలు మంగమ్మగారి కళ్యాణం 1975వ సంవత్సరం మార్చి నెల 6వ తేదీన

భగవదవతారులు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి నివసించిన కర్నూలు జిల్లాలోని బనగానపల్లె పట్టణంలో అత్యంత వైభవంగా జరిగింది. ఆ కళ్యాణం లోక కళ్యాణమే అయింది!

శ్రీ భరద్వాజ గురుదేవులు, అలివేలు మంగమ్మ గారు ఆదర్శవంతమైన గృహస్థ జీవనం గడిపారు. ఆ పుణ్యదంపతులకు ప్రతి నిత్యం సాయినాథుని ఆరాధన, ధర్మప్రచారం-- ఈ విషయాలపై ప్రజలను జాగృతం చేయాలన్నదే వారి కర్తవ్యం. ఇంటికి వచ్చే అసంఖ్యాక భక్తులకు ఆత్మబోధ గావించే పతిదేవునికి కుడిభుజంగా సర్వవిధాలా సహాయ సహకారాలు అందించేవారు శ్రీ అలివేలు మంగమ్మ గారు.

అయితే జిల్లెళ్ళమూడిలో మొదలైన అనారోగ్యం ఆమెను జీవితాంతం వెంటాడింది. విద్యానగర్ లో ఉన్నప్పుడు కుడి మోచేయి వద్ద కురుపులాగవచ్చి క్రమంగా చేయి స్వాధీనం తప్పి పూర్తిగా చలనం లేకుండా పోయింది.

అయినా అంతటి అనారోగ్యంలో కూడా ఆమెలో ఏమాత్రం అధైర్యం, అసంతృప్తి కనపడేదికాదు. ఎప్పుడూ ఉత్సాహంగా ఇంటి పనులన్నీ ఒంటిచేత్తోనే నిర్వహిస్తూ ఉండేవారు. మాస్టారుని అత్యంత ప్రేమ, భక్తి, అంకితభావంతో సేవించు కొనడంలో ఏమాత్రం రాజీ పడేవారు కాదు. ఇంటి పనులు, వంటపనులు నిర్వర్తిస్తూనే మాస్టారి ఆదేశానుసారం సాయిబాబా పత్రికకు ఆర్టికల్సు వ్రాయటం, ఆయన ఆదేశించిన సాధనలను కొనసాగించడం, తు.చ. తప్పక చేసేవారు. చాలామంది భక్తులు మాస్టారు సన్నిధిలో వుండాలని గృహానికి వచ్చి కొన్ని రోజులు వుండేవారు. అంతటి అనారోగ్యంలోనూ ఆమె వచ్చిన వారి బాగోగులు చూస్తూ, వారికి ఆహారము, సదుపాయాలు సమకూర్చడంలో ఎంతో శ్రద్ధ చూపేవారు. కొందరు బంధుజనుల పిల్లల ఉపనయనము, వివాహాలు స్వయంగా తామే నిర్వహించారు. తమ ఇద్దరు బిడ్డల పెంపకంలో ఆమె చూపిన శ్రద్ధ అపారం. ద్వారకనాథ్ పుట్టిన తర్వాత ఆమె వ్యాధి తీవ్రమై చివరకు మంచానికే పరిమితమైనప్పటికీ, పిల్లల చదువు సంధ్యలు, ఆట పాటలు అన్నీ సక్రమంగా నిర్వహించడమే కాదు, వేదమ్మకు సంగీతం, నాట్యం, వీణ, ద్వారకకు చిత్రలేఖనం, క్రికెట్, స్కిట్స్; వేదమ్మ ముగ్గుల పోటీలలో పాల్గొనడం-- యిలా కళారంగాలలో కూడా ప్రవీణులయ్యేందుకు ఎంతగానో శ్రమించారు.

ఆ అసహాయస్థితిలో కూడా ఇంటి నిర్వహణలోని ప్రతి అంశము స్వయంగా పర్యవేక్షిస్తూ వుండేవారు. పేదసాదలకు సహాయపడేవారు. సేవాసంస్థలకు ఆర్థిక, వస్తురూపేణా సహాయమందించేవారు. పిల్లలు పెద్దవారయ్యాక వారిని కూడా అలా సంఘసేవా కార్యక్రమాలకు ప్రోత్సహించి నడిపించేవారు. ఆమె శిక్షణలో వేదమ్మ, ద్వారక యిద్దరూ కూడా గొప్ప ఆధ్యాత్మిక పరిణితి పొందటమే కాదు, ఆధ్యాత్మిక బోధనలు, సత్సంగాలు, పూజా ఉత్సవాల నిర్వహణలు, రచనా కార్యక్రమాలు - యిలా పలురంగాలలో నిష్ణాతులై వారి తాతగారైన శ్రీ అనంతాచార్య, తండ్రి శ్రీ భరద్వాజ గురుదేవుల వారసత్వాన్ని కొనసాగిస్తున్నారనడంలో ఎంతమాత్రం సందేహం లేదు. ఇలా భరద్వాజ గురుదేవుల అవతార ఉద్దేశ్యాన్ని సఫలీకృతం చేయటానికి తన కుటుంబమంతటినీ అప్రమత్తం చేస్తూ, యిందుకు మూలస్థంభమై నిలిచారు, మన మాతృదేవి శ్రీ అలివేలు మంగమ్మ గారు.

అన్నింటికంటే అతి ముఖ్యమైన ఆశ్చర్యకరమైన విషయం -- ఆమె ఎంతో అనారోగ్యంతో వున్నా మాస్టారిని తనకు ఎప్పుడూ తోడుగా, తనని అంటిపెట్టుకొని వుండాలని ఆశించక, ఆయనను సమాజానికి అంకితమయ్యేలా సహకరించటం! అంటే ఆయన సాన్నిధ్యాన్ని తనకు చాలా పరిమితం చేసుకుని, ఎక్కువ సమయం ఇతరులకే ఆయన సాంగత్యం లభించేలా -- ఆ విధంగా అజ్ఞానంలో ఉన్న జనులు ఉద్ధరింపబడేందుకుగాను -- ఇతరుల కోసమే ఆయనను - ఒకరకంగా త్యాగం చేశారనిపిస్తుంది. ఇది ఎంత గొప్ప విషయం!!

ఇలా చెప్పుకుంటూపోతే ఆమె జీవితం ఒక మహాసముద్రం!

అందులో ఎగసిపడే ఆమె ధర్మజీవన సన్నివేశాల కెరటాలు అనంతం!

అవి ఎప్పటికీ మనకు ఆదర్శం!

అంతేకాదు, ఆమె శరీరత్యాగం చేసినట్లు అనిపిస్తున్నా ఆమె దివ్యసాన్నిధ్యం మనకు ఎప్పటికీ శాశ్వతం!

ఇది నిజం!!

ఆచార్యుని అద్భుత లీలలు

పూజ్యశ్రీ భరద్వాజ మహారాజ్ లీలావైభవాన్ని ఒంగోలుకి వాస్తవ్యులు వెంకట కృష్ణమోహన్ గారు (కృష్ణ) ఈవిధంగా తెలియచేస్తున్నారు--

మా నాన్నగారు ఒంగోలులో పోస్టుమాస్టర్ గా ఉద్యోగం చేసేవారు. నేను ఇంటర్ చదివే రోజుల్లో మొట్టమొదటిసారి పూజ్యశ్రీ మాస్టరుగారు బాబా గుడిలో సత్సంగం చెప్తుంటే వెళ్లాను. సత్సంగం తరువాత పూజ్యశ్రీ మాస్టరుగారు బయటకు వచ్చాక అందరూ నమస్కారము చేసుకుంటున్నారు. అందరితో పాటు నేను కూడా పాదాలను తాకి నమస్కారం చేసుకోగానే నా ఒళ్ళంతా పులకరించింది! ఆ అనుభవం నాలుగైదు రోజులు అలాగే వుంది! అప్పటినించి ఎక్కడ పూజ్యశ్రీ మాస్టరుగారి సత్సంగాలు జరిగినా తప్పకుండా హాజరయ్యేవాడిని. కానీ ఆయనంటే ఎందుకో నాకు చాలా భయంగా వుండేది.

ఎదురుగా వున్నా ఎక్కువ మాట్లాడే వాడిని కాదు. తలెత్తి ఆయన కళ్ళల్లోకి చూసేవాడిని కూడా కాదు. ఎందుకంటే 'ఒక్క నమస్కారం పెట్టగానే ఇంత అనుభవం ఇచ్చారంటే ఈయన చాలా గొప్పవారు, ఆయన ఎదురుగా వుండటం అంటే మాటలు కాదు, చాలా జాగ్రత్తగా వుండాలి!' అనిపించేది.

కొన్నాళ్ళకి గురుబంధువులద్వారా పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గర సేవ లభించింది. అంటే పూజ్యశ్రీ మాస్టరుగారి గ్రంథాలకు సంబంధించిన నోట్స్ ఆయన చెప్తూవుంటే నేను వ్రాయడం, టైపు చేయడం చేసేవాడిని.

ఒకసారి నేను వ్రాయడానికి వెళ్లేసరికి నాకు బాగా జ్వరంగా వుంది. చేతులు వణుకుతున్నాయి. పూజ్యశ్రీ మాస్టరుగారు కనిపెట్టేవుంటారు. అలాగే వ్రాస్తూ ఆలోచిస్తున్నాను -- 'కొన్నిరోజులలో టైపు ఎగ్జామ్స్ వున్నాయి. నేను ఫస్ట్ గ్రేడ్ లో పాస్ అవ్వాలంటే 75 మార్కులు రావాలి. అలా వస్తే పూజ్యశ్రీ మాస్టరుగారూ! మీ దయ అనుకుంటాను. పాస్ అయితే బాబా అనుగ్రహం అనుకుంటాను' అనుకున్నాను! ఈ ఆలోచనకు నాకే నవ్వు వచ్చింది. 'పరీక్షకు వెళ్ళడానికే ఓపిక లేదు కానీ, మీరు లీల చెయ్యాలి అని ఆశించడం... మనిషికి ఎంత ఆశో!..'

పరీక్ష రోజు రానే వచ్చింది. హాల్ కి వెళ్ళాక పేపర్ ఇవ్వగానే కాస్సేపు ఏమీ కొట్టకుండా కూర్చున్నాను. 'ఎటూ వచ్చాము కదా, ఊరికే కూర్చోవడం ఎందుకు?' అని అప్పుడు పేపర్ పూర్తి చేసి బయటకు వచ్చాను. మనసులో మాత్రం తప్పకుండా తప్పుతానని నమ్మకం.

తరవాత కొన్నాళ్ళకి ఫలితాలు వచ్చాయి. ఇనిస్టిట్యూట్ కి రమ్మని కబురు వచ్చింది. 'ఎటూ ఫెయిల్ అయ్యేటప్పుడు అక్కడకి వెళ్ళడమెందుకు?' అనిపించింది. కబురు చేశారని వెళ్లాను. అక్కడ బోర్డు మీద లిస్ట్ వ్రాస్తారు. లోపలకి వెళ్లినా నేను బోర్డు చూడలేదు. లిస్ట్ చూసుకోమన్నారు. అయిష్టంగానే చూశాను. నా పేరు ఫస్ట్ క్లాస్ లో వుంది. 75 మార్కులు వచ్చాయి! ఆశ్చర్యంతో నోటమాట రాలేదు -- ఒకవైపు ఫస్ట్ క్లాస్ వచ్చినందుకు అయితే, ఇంకొకవైపు పూజ్యశ్రీ మాస్టరుగారు చేసిన లీలకి! కనీసం పరీక్షకి వెళుతున్నానని ఆయనతో చెప్పను కూడా లేదు... కేవలం మనసులో అనుకున్నందుకు ఇంతటి అనుగ్రహమా?! పోనీ సంతోషంగా ఈ విషయమైనా పూజ్యశ్రీ మాస్టరుగారికి చెప్పానా అంటే అదీ లేదు! కారణం భయం. వారి దగ్గర కూర్చుని వ్రాస్తున్నా ఏనాడూ మాట్లాడింది లేదు. వారే మధ్యమధ్యలో జోక్స్ వేసి నవ్వించేవారు. వారి అనుగ్రహంతో పాస్ అయ్యానని తెలిసి వారితో చెప్పక పోవడం!! చిత్రమైన మానసిక పరిస్థితి నాది! పూజ్యశ్రీ మాస్టరుగారు కూడా నన్నేమీ అడగలేదు.

కొన్నాళ్ళు పోయాక మనవాళ్ళందరూ, "అంతటి అనుభవమిచ్చారు కదా, పూజ్యశ్రీ మాస్టరుగారికి ఏదైనా సమర్పించుకో!" అన్నారు. అప్పుడు ఒక డజన్ అరటిపళ్ళు, ఒక పెద్ద పూలమాల, రెండు రూపాయల దక్షిణ సమర్పించుకున్నాను. అప్పుడు కూడా నేను కారణం చెప్పలేదు, ఆయన అడగలేదు!

మా నాన్నకి పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి నేను వెళ్లడం ఇష్టముండేది కాదు. అయినా నేను మానేవాడిని కాదు. నేను పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంట్లో కాకబలి పెట్టడం చూసి, మా ఇంట్లో నాకు పెట్టిన అన్నంలోనుంచి కొంత అన్నం కాకబలికి బైటపెట్టేవాడిని. అది చూసి మా నాన్న, "వాడు అనవసరంగా అన్నం వృధా చేస్తున్నాడు, వాడికి అంత అన్నం పెట్టకు!" అన్నారు. నేను కొంచెం అన్నం పెట్టించుకుని, దాన్లోనే కాకబలికి పెట్టి, మిగతా అన్నంలో మజ్జిగ వేసుకుని తిని లేచిపోయేవాడిని. కొన్నాళ్ళకి ఇక చెప్పినా వినటం లేదని, మళ్ళీ మామూలుగా అన్నం పెట్టేవారు. అట్లాంటి మా నాన్న, పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి అయినరోజున వారిని సమాధి చేసే స్థలానికి వెళ్లేసరికి, అక్కడ సమాధికి మట్టి తవ్వుతున్నారు!!! నేను ఇంటికి వచ్చాక, "ఇన్నాళ్ళూ వారిని గురించి అదీ ఇదీ మాట్లాడుతుండేవాడివి, ఈరోజు అక్కడకి ఎందుకు వచ్చావ్?" అని అడిగాను. "ఏం లేదురా, ఆయన సమాధి అయిన సమయం చూశాను. (మా నాన్నకి పంచాంగం చూసే అలవాటు వుండేది). చాలా గొప్ప సమయం రా! ఆయనకిక జన్మ లేదు!" అన్నారు. తరువాత పూజ్యశ్రీ మాస్టరుగారు వ్రాసిన గ్రంథాలన్నీ చదివేవారాయన!

నేను డిగ్రీలో చేరడానికి మన గురుబంధువు ఒకాయన, "శర్మ కాలేజీలో అప్లై చేయి, సీట్ నేనిప్పిస్తాను" అన్నారు. కానీ సీట్ రాలేదు. ఆ తరువాత మా ఇంటిపక్కన BDO ఒకాయన వుండేవారు. ఆయన నా పరిస్థితి చూసి, "మద్దిపాడులో మంగమ్మ కాలేజీలో అప్లై చేయి, నేను రికమెండ్ చేస్తాను"

అన్నారు. అక్కడ కూడా సీట్స్ అయిపోయాయి. కానీ ఆ కాలేజీవాళ్ళు, "ఆయన ఎవరికీ రికమండ్ చేయరు. ఆయన అడిగారు కనుక, మళ్ళీ యూనివర్సిటీకి అప్లై చేస్తాము. వాళ్ళు ఒప్పుకుంటే ఫస్ట్ సీట్ నీకే ఇస్తాము" అన్నారు. అప్పటికే చాలా ఆలస్యమయింది. కనుక ఆ సంవత్సరం వృధా అయిపోయిందని ఊరుకున్నాను. మా నాన్న కూడా ఈ విషయంలో చాలా బాధపడేవారు.

ఇదిలా వుండగా ఒకసారి పూజ్యశ్రీ మాస్టరుగారి ఇంటికి రామిరెడ్డి తాతగారు వస్తే నేను వెళ్తూ మా నాన్నని కూడా తీసుకునివెళ్లాను. ఆయనని చూసి, "ఇలా వున్నారేమిటిరా?" అని మా నాన్న నన్నడిగారు. ఆయన గొప్ప మహాత్ముడని, మనం ఏదన్నా కోరుకుంటే (అంటే అయ్యే అవకాశం లేనిది) నిజమైన మహాత్ములైతే జరుగుతుందనీ చెప్పాను.

ఆరోజు సాయంత్రం 6 గంటలకు ఇంటికి చేరుకోగానే మద్దిపాడు కాలేజీనుంచి ఫోన్ వచ్చింది.. అర్జెంటుగా రమ్మనమని! బయలుదేరి వెళ్ళాక, "ఇంకా కొన్ని సీట్స్‌కి పర్మిషన్ వచ్చింది. ఫస్ట్ సీట్ నీకే ఇస్తున్నాము" అని చెప్పారు! ఈ సంగతి వినిన వెంటనే మా నాన్న, "ఆయన మహాత్ముడేరా!" అన్నారు. "ఎవరు నాన్నా?" అంటే, "అదేరా, రామిరెడ్డి తాత!" అన్నారు. "ఎందుకు నాన్నా?" అంటే, "నీకు ఈ సంవత్సరం అంతా వృధా అయిపోయిందని బాధ పడుతున్నాము కదా, ఆయన మహాత్ముడైతే ఎలాగైనా నీకు కాలేజీలో సీట్ రావాలని మొక్కుకున్నాను. కొన్ని సీట్లు తెప్పించి మరీ అవకాశం ఇచ్చారు! అందుకే ఆయనని మహాత్ముడన్నాను" అన్నారు! అప్పటినుంచి మా నాన్నకి కూడా బాగా గురి కుదిరింది.

ఇలా మా జీవితాలలో ఎన్నో అద్భుతాలు చేసిన పూజ్యశ్రీ మాస్టరుగారు కరుణకి ప్రతిరూపం. ఆయనే కాదు, వారి కుటుంబమంతా అంతే! ఆనాడు మాస్టరుగారి దగ్గరకి వ్రాసే సేవకి వెళ్లడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఏదోరకంగా వారి దగ్గరకి రప్పించుకుని మమ్మల్ని ఉద్ధరించిన మహాత్ముడాయన! నిజానికి ఆయనకి మావల్ల కొంచెం కూడా ఉపయోగమేమీ లేదు. కానీ మాకు వారి ఇంటికి వెళ్తే తిండి దగ్గరనుంచీ అన్నీ సమృద్ధిగా దొరికేవి. పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి అయ్యాక పూజ్యశ్రీ అమ్మగారు కూడా అంతే ఆదరంతో చూశారు. అటువంటి మహాత్ముల ఆదరణను పొందగలగడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. వారి ఆదరణ, అనుగ్రహం నాపై ఎల్లవేళలా వుండాలని కోరుకుంటూ కృతజ్ఞతాపూర్వక వందనములు తెలియచేసుకుంటున్నాను!!

– వెంకట కృష్ణమోహన్,
ఒంగోలు

పూజ్యశ్రీ భరద్వాజ మహరాజ్ లీలావైభవాన్ని, సూళ్లూరుపేట సత్సంగ సభ్యులు శ్రీ రాజాలాల్ గారు ఈవిధంగా తెలియచేస్తున్నారు.

నాకు పూజ్యశ్రీ మాస్టరుగారు 'మరోనందదీపం' అనే గ్రంథం ద్వారా పరిచయం అయ్యారు.1989 ఫిబ్రవరిలో నా స్నేహితుడు శ్రీనివాసులు ఆ గ్రంథం యిచ్చాడు. ఆ గ్రంథం మీద పూజ్యశ్రీ మాస్టరుగారి పటం చూసినప్పుడు, వారికళ్ళు చాలా తీక్షణంగా వున్నాయి. ఆ చూపు నా హృదయాంతరాలలో ఎక్కడో తాకింది. వారికి, నాకూ ఏదో సంబంధం వుందనిపించింది. వీరు ఎవరని మా స్నేహితుడిని అడిగాను. "అయన భరద్వాజ మాస్టరుగారు. సాయి భక్తులు, సాయిబాబా గురించి చెప్తారు. ఒంగోలులో వుంటారు" అని చెప్పాడు. నాకు బాబా గురించి కూడా ఎక్కువగా తెలియదు. మాది మిఠాయి వ్యాపారం. ఏదో నా వ్యాపారం, నా గొడవ తప్పితే నాకు యింకేమి తెలియదు. కానీ మరోనందదీపం గ్రంథం నా వద్దకు వచ్చిన దగ్గరనించి, పూజ్యశ్రీ మాస్టరుగారిని మరచిపోలేకపోయాను. కొన్నాళ్ళకి 'శ్రీగురుచరిత్ర' గ్రంథం కొనుక్కున్నాను. ఏప్రిల్ నెలలో పూజ్యశ్రీ మాస్టరుగారు సమాధి అయినారని తెలిసి చాలా బాధపడ్డాను. వ్యాపారం నేనొక్కడినే చూసుకోవడం వల్ల, వెంటనే వెళ్ళడానికి కుదరలేదు. నేను మరోనందదీపం పుస్తకం అట్ట మీద బొమ్మ ఫోటో కట్టించి, గూట్లో పెట్టుకుని రోజు రెండు ఊదుకడ్డీలు వెలిగించి కొట్టుకి వెళ్ళేవాడిని. గురుచరిత్ర పారాయణ చేసేవాడిని.

ఒకరోజు ఉదయం పూజ్యశ్రీ మాస్టరుగారికి, కడ్డీ వెలిగిస్తుంటే, పటం జారిపోతోంది. ఎన్నిసార్లు సరిచేసినా అలాగే జరుగుతోంది. ఎందుకిలా జరుగుతోందని ఒక నిముషం ఆలోచించాను. ముందటి రోజు వ్యాపారంలో

ఒక తప్పుచేసాను. అకస్మాత్తుగా నాకది గుర్తుకొచ్చింది. అందుకే యిలా జరుగుతోందేమోనని, పూజ్యశ్రీ మాస్టరుగారికి క్షమాపణ చెప్పుకుని, కడ్డీలు వెలిగించాను. ఇప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారి పటం జారకుండా సరిగ్గా వుంది. అప్పుడు నాకు అనిపించింది... 'మాస్టరుగారు నన్ను గమనిస్తున్నారు, నేను వారి మనిషిని' అని! ఇది అయ్యాక పూజ్యశ్రీ మాస్టరుగారిని చూడలేదే అని తపన చాలా పెరిగింది. ఆ తర్వాత ఒకరోజు ఒంగోలుకి వెళ్లి సమాధి దర్శనం చేసుకున్నాను. పూజ్యశ్రీ అమ్మగారు అక్కడే వున్నారని తెలిసి వారి దర్శనం కూడా చేసుకున్నాను.

తరువాత ఒక గురుపూర్ణిమకి ముందు, ఒక స్వప్నం వచ్చింది. నా చెవిలో ఏవో మాటలు వినిపిస్తున్నాయి. అది పూజ్యశ్రీ మాస్టరుగారి స్వరం. నేను మంచం మీదనించి లేవాలన్నా లేవలేక పోతున్నాను. నా చెవిలో పూజ్యశ్రీ మాస్టరుగారు, "అందరూ ముక్తి ధామానికి పోవాలి. నేను చెక్క వంతెన లాగా వుంటే చాలు, చివరి వాడు నన్ను తీసుకుని వెడితే చాలు" అని చెబుతూ, "దానికి అర్థమేమిటిరా?" అని నన్ను అడుగుతున్నారు. "నాకేమీ తెలియదు మాస్టారూ, మీరే చెప్పండి" అన్నాను. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారు, "అందరూ సాయిని గురించి తెలుసుకుని, ఆయన చెప్పినట్లు చేస్తే నాకు చాలా సంతోషంగా వుంటుంది. మీరందరూ పారాయణలు, సత్సంగాలూ చేసుకుంటూ వుంటే, నేను మీ వెంటే వుంటాను. ఇలా చేస్తే అందరూ ముక్తిధామానికి చేరుకుంటారు" అని చాలా స్పష్టంగా చెప్పారు. అప్పటివరకూ నేను పారాయణ మాత్రమే చేస్తున్నాను. అప్పటి నించి ప్రతి మంగళవారం మా ఇంట్లో సత్సంగం కూడా చేసుకుంటున్నాము. దాదాపు పదిహేడు, పద్దెనిమిది సంవత్సరాలు అవుతోంది. ఇప్పటికీ అది కొనసాగుతూనే వుంది.

నాకు సాయిబాబా పత్రికలు పాతవి, చదవాలని బాగా యిష్టంగా వుండేది. అంటే, 1989 కి ముందు పత్రికలు. అప్పుడు పక్షపత్రికలు వచ్చేవి, అవి యెట్లా సంపాదించాలా అని ఆలోచించేవాడిని. ఇదే విషయం పూజ్యశ్రీ మాస్టరుగారితో చెప్పుకున్నాను. వారితో చెప్పుకుంటే ఏదైనా జరిగితీరవలసినదే! ఒకరోజు సాయంత్రం సమయంలో మా మిఠాయి కొట్లో, చాలా పనిలో మునిగివుండగా, ఒక పిల్లవాడు, ఒక కట్టకట్టిన కాగితాలు తెచ్చి, "అన్నా! ఇవి నీకు పనికి వస్తాయి అన్నా, తీసుకో అన్నా" అని అడిగాడు.

అప్పట్లో మేము, ఆకులలోను, కాగితాలలోను మిఠాయి కట్టి యిచ్చేవాళ్ళము. నా దగ్గర అవి చాలా వున్నాయి. అదే సంగతి ఆ పిల్లవాడితో చెప్పాను. "కాదన్నా, ఎంతో కొంతయిచ్చి తీసుకో అన్నా" అని బ్రతిమాలుతున్నాడు. సరేనని తీసుకున్నాను. వాడు వెళ్ళాక చూస్తే, అవన్నీ సాయిబాబా పత్రిక పాత సంచికలు!! నేను చాలా ఆశ్చర్యపోయాను. నేను ఏమి కావాలనుకున్నానో అవన్నీ ఒక కట్ట కట్టి వున్నాయి. అలా వచ్చిన ఆ పిల్లాడు ఎవరు? ఒద్దు అంటున్నా, 'నీకు పనికి వస్తాయి' అనిచెప్పి యిచ్చివెళ్ళాడు. నాకు కళ్ళ నుండి నీళ్లు గిర్రున తిరిగాయి. ధర్మబద్ధమైన కోరికలు మనం ఆర్తితో కోరుకుంటే, పూజ్యశ్రీ మాస్టరుగారు నెరవేర్చకుండా వుండేదే లేదు.

నేను యింకొకసారి పూజ్యశ్రీ మాస్టరుగారిని, "మీరు చెప్పిన అవధూతల దర్శనాలు యిప్పించండి" అంటూ ప్రార్థన చేసి, పారాయణ చేసాను. వారి దయవల్ల, శ్రీ నాగమునీంద్రస్వామి, శ్రీ రామిరెడ్డి తాత, శ్రీ రాంసూరత్ కుమార్, శ్రీ పూర్ణానంద స్వామి, శ్రీ అనసూయమాత, శ్రీ గులాబ్ బాబా, శ్రీ పోలయ్య తాత దర్శన ఆశీస్సులు లభించాయి. దారి సరిగ్గా తెలియక పోయినా, భాష రాకపోయినా, అందరి దర్శనాలు చాలా బాగా జరిగాయి. అనంతసాగరం శ్రీ నాగమునీంద్రస్వామి దగ్గర నెల రోజులు మా అమ్మ, నేను, మా ఆవిడ వుండి సేవ చేసుకునే అదృష్టం కలిగింది. అనసూయమాత దర్శనానికి పరాడ్ సింగా వెడితే, మాత నాగపూరుకి వెళ్లారని చెప్పారు. మేము మళ్ళీ నాగపూరుకి బయలుదేరుతూ, అక్కడ దారి కనుక్కోగలమో లేదో అని ఆలోచనలో పడితే, అప్పుడే ఒక సాధువు మా దగ్గరికి వచ్చి, "నేను నాగపూర్ అనసూయా మాత దర్శనానికి వెళ్ళాలి, మీ వాహనం (వెహికల్) లో స్థలం యిస్తారా?" అని హిందీలో అడిగారు. మా అందరికి చాలా ఆశ్చర్యానందాలు కలిగాయి. ఆయనని మాతో తీసుకుని వెళ్లి, మేము ఏమాత్రం కష్టపడకుండా దర్శనం చేసుకున్నాము. ఇదంతా పూజ్యశ్రీ మాస్టరుగారి దయకాకుంటే మరేమిటి? అలాగే శ్రీ పూర్ణానందస్వామి దర్శనానికి వెళ్ళినప్పుడు, కొంచెం ఆలస్యమై రాత్రి అయ్యింది. అక్కడి వాళ్ళు "స్వామి లోపలికి వెళ్లిపోయారు. ఇంక యిప్పుడు రారు" అన్నారు. మేము అక్కడే కూర్చుని, మనసులో బాబా, మాస్టరుగార్ల నామం చెప్పుకుంటున్నాము. వెంటనే పూర్ణానందస్వామి వారు తలుపు తీసుకుని వచ్చారు. అక్కడ అందరూ ఆశ్చర్యపోయారు. శ్రీ సాయిబాబా, శ్రీ మాస్టరుగార్ల నామమహిమ అటువంటిది. ఇలా ప్రతి యాత్రలోను పూజ్యశ్రీ మాస్టరుగారు నేనున్నానంటూ మాతోపాటు వుండి, మహాత్ముల దర్శనాలు చేయించారు.

ప్రత్యక్షంగా వారి దర్శనం చేసుకోలేకపోయినా, 'నువ్వు నావాడివిరా' అని, నా వెంటవుండి, ఐహిక, ఆధ్యాత్మిక జీవితంలో, నా చేయి పట్టుకుని నడిపిస్తున్న పూజ్యశ్రీ భరద్వాజ మాస్టరుగారి పాదపద్మములకు కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలులు తెలియజేసు కుంటున్నాను.

జై సాయి మాస్టర్!!

- రాజా లాల్,
సుళ్ళూరుపేట

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర	450-00
శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర	90-00
శ్రీ సాయి లీలామృతము	99-00
శ్రీ గురు చరిత్ర	99-00
శ్రీ సాయి సన్నిధి	120-00
శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు	125-00
శ్రీ సాయినాథ ప్రబోధామృతము	80-00
సాయినాథ పూజ	40-00
సాయినాథ స్థవనమంజరి	10-00
శిరిడి ఆరతులు	15-00
సాయిబాబాను సేవించడమెందుకు	10-00
సత్సంగము-భజన	5-00
శిరిడి క్షేత్ర సందర్శనము	40-00
విజ్ఞాన వీచికలు	99-00
పరిప్రశ్న	99-00
మతమెందుకు?	50-00
ఏది నిజం?	50-00
ధ్యానయోగ సర్వస్వం	99-00
బుద్ధధ్యాన హృదయం	49-00
దత్తావతార మహత్త్వం	75-00
సంహితాయన గురు ద్విసాహస్రి	128-00
పురుషసూక్త రహస్యం	40-00
సాయిసూక్తి-ఆచార్యవాణి	10-00
శ్రీ పాకలపాటి గురువుగారు	49-00
అవధూత శ్రీ చీరాల స్వామి	49-00
అవధూత శ్రీ వెంకయ్యస్వామి	70-00
శ్రీ ఆనందమాయి అమ్మ	49-00
టిబెట్ యోగి మిలారేపా చరిత్ర	80-00
శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర	49-00
స్వామి సమర్థ(అక్కల్కోట స్వామి)	49-00
మనము-మన సంస్కృతి	70-00

ఇతర ప్రచురణలు

మహాత్ముల ముద్దుబిడ్డడు	120-00
అవధూత చివటం అమ్మ	70-00
శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర	70-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు	125-00
మరో నందదీపం	80-00
ఆచార్య అమృత లేఖావళి	40-00
భగవాన్ శ్రీ భరద్వాజ	175-00
బాలల శ్రీ సాయి లీలామృతము	25-00
మహాపురుషుడు	50-00
శ్రీ సాయి మాస్టర్ స్మృతులు (2)	125-00
బాలల శ్రీ సాయి సన్నిధి	50-00
బాలల గురు చరిత్ర	49-00
శ్రీ సాయిమాస్టర్ నిత్య సత్య వ్రతము	15-00

BOOKS IN ENGLISH

Sai Baba the Master	175-00
Sree Guru Charitra	99-00
Supreme Master(Swami Samartha)	99-00
Sai Baba of Shiridi and His Teachings	99-00
Life and Teachings of Hazarat Tajuddin Baba	99-00
Children's Sai Baba the Master	60-00

BOOKS IN OTHER LANGUAGES

Sadguru Sai Baba(Hindi)	150-00
Sai Leelamrutham(Kannada)	150-00
Sai Baba Jeevitha Charitham(Malayalam)	220-00
Sai Baba Leelamrutham(Tamil)	175-00
Sri Guru Charitra (Hindi)	99-00
Swami Samartha (Kannada)	99-00
Sri Guru Charitra(Kannada)	45-00
Shiridi Aarathi(Tamil)	15-00
Stavana Manjari(Tamil)	10-00
Tibet Yogi Milarepa Jeevitha Charitra(kannada)	55-00
Sri Sainath Prabodhamruthamu (Kannada)	65-00
Sri Guru Charitra (Oriya)	150-00
Sri Sai Sannidhi (Kannada)	120-00
Sri Guru Charitra (Malyalam)	150-00

SRI GURUPADUKA PUBLICATIONS, c/o SRI MANGA BHARADWAJA TRUST,
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : +91 - 74160 41550
Branch Office: Kondaiah Bunk Street, Kothapet, Ongole, Prakasam Dt., Andhra Pradesh.
Phone: 08592 233271
Send DD in favour of "Sri Manga Bharadwaja Trust(Publications)", payable at Hyderabad or Ongole.

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2021-2023, Regd.No. 37926/83.

దివ్యజనని అలివేలు మంగమ్మ గారి జన్మదిన మహోత్సవము

అక్టోబర్ 01, 2021

IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET,
KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.